# విశాల భారతి

22-12-2025

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:3 సంచిక: 352


## ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరే




- కేసీఆర్‌కి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిస్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు
- ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరేనని ఆరోపించారు
- తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు
- గుండెకాయ లాంటి కాళేశ్వరాన్ని కూలకొట్టారని అన్నారు
- ప్రాజెక్టు ఎలాంటి ప్రయోజనం జరగలేదని స్పష్టం చేశారు
- ప్రజల భవిష్యత్తును ఆయన తాకట్టు పెట్టారని ఆరోపించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కి తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరేనని ఆరోపించారు. ఆదివారం తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇరిగేషన్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు 90శాతం అబద్ధమని అన్నారు. కాళేశ్వరం తెలంగాణకు గుండెకాయ అన్నారని.. అది కూలిపోయిందని చెప్పుకొచ్చారు. రూ.1. 80వేల కోట్లతో కట్టిన ప్రాజెక్టు

మిగతా 3లో..

# దమ్ముంటే అసెంబ్లీకి రా కేసీఆర్..!

## సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ మధ్య మాటల యుద్ధం



- తెలంగాణ ప్రభుత్వాన్ని దద్దమ్మ ప్రభుత్వం అని కేసీఆర్ విమర్శించారు
- కేసీఆర్ రాష్ట్రాన్ని దెబ్బతీశారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు
- బీఆర్ఎస్ నాయకత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు
- కేసీఆర్ ప్రాథమికంగా చంద్రబాబు శిష్యుడేనని అన్నారు
- పట్టిసీమ ప్రాజెక్టును అభినందించిన విషయాన్ని గుర్తు చేశారు
- కేసీఆర్‌ను ఒక ఆర్థిక ఉగ్రవాదిగా అభివర్ణించారు రేవంత్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. తెలంగాణ ప్రభుత్వాన్ని దద్దమ్మ ప్రభుత్వం అని, రెండేళ్లు గడువు ఇచ్చినా, ఏ అభివృద్ధి చేయలేదని, హామీలు నెరవేర్చలేదని కేసీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దెబ్బతీశారని, ఆయన చేసిన ద్రోహం ఏ ఇతర నాయకుడు చేయలేదని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి 'చిట్ చాట్'లో మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రాథమికంగా చంద్రబాబు శిష్యుడేనని, గతంలో పట్టిసీమ ప్రాజెక్టును అభినందించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆయన చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. "ఆయన తమలపాకుతో కొడితే నేను తలుపు కర్రతో కొడతాను.. ఆయన విసనకర్రతో అంటే నేను నీటి తొట్టితో సమాధానం చెబుతాను" అంటూ రేవంత్ రెడ్డి తనదైన శైలిలో హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి రంగంలో జరిగిన అన్యాయాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్‌ను ఒక "ఆర్థిక ఉగ్రవాది "గా అభివర్ణిస్తూ, 8 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసి రాష్ట్రానికి కేసీఆర్ మరణశాసనం రాశారని మండిపడ్డారు. 811 టీఎంసీలలో 512 టీఎంసీలను ఏపీకి కట్టబెట్టి, జలదోపిడీకి సహకరించారని ఆరోపించారు. కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం లిఫ్టులు కట్టారని, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు డీపీఆర్‌ను కూడా సరిగా సమర్పించలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని అంతర్గత విభేదాలపై కూడా రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబంలో అధికారం కోసం పోరాటం జరుగుతోందని, కొడుకు కేటీఆర్, అల్లుడు హరీష్ రావు మధ్య గొడవల వల్లే కేసీఆర్ ఇప్పుడు బయటకు వచ్చారని ఎద్దేవా చేశారు. సీఎం పదవి కోసం కేటీఆర్ ఇప్పటికే కొత్త బట్టలు కుట్టించుకున్నారని, మరోవైపు హరీష్ రావు రూ. 5,300 కోట్ల పార్టీ ఆస్తులను హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారని విమర్శించారు.

మిగతా 3లో..

## బంగ్లాదేశీ చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ



- కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు
- బంగ్లా దేశీయులు భారత్‌లోకి స్థిరపడేందుకు సాయం చేస్తున్నారు
- కాంగ్రెస్ హయాంలో రైతుల కష్టాలను వినే నాథుడే లేదని ఆరోపించారు
- మోదీ బ్రౌన్ ఫీల్డ్ యూరియా ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు

02

# తెలంగాణలో 'సర్'

- ఎస్ఐఆర్ ప్రక్రియపై సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు
- తదుపరి ఓటరు జాబితా సవరణ తెలంగాణలోనే అని తెలిపారు
- రవీంద్ర భారతిలో బీఎల్‌వోల సమావేశంలో పాల్గొన్నారు
- బీఆర్ఎస్ నాయకత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు
- ఎస్ఐఆర్ ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు
- సగటున ఒక్కో బీఎల్‌వోకు 930 మంది ఓటర్లు వస్తారని స్పష్టం
- ఎస్ఐఆర్ నిర్వహించడం చాలా ముఖ్యమని వెల్లడించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. తదుపరి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తెలంగాణలోనే అని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పర్యటనలో ఉన్న ఆయన ఆదివారం రవీంద్ర భారతిలో బీఎల్‌వోల సమావేశంలో పాల్గొన్నారు. ఈమేరకు ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలోనూ ఎస్ఐఆర్ ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సగటున ఒక్కో బీఎల్‌వోకు 930 మంది ఓటర్లు వస్తారని జ్ఞానేశ్ కుమార్ స్పష్టం చేశారు.



మిగతా 2లో..

## మహాజాతర పోస్టర్ విడుదల చేసిన సీఎం

మేడారం మహా జాతర2026 పోస్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు




- జనవరి 28 నుంచి 31 వరకు జాతర వైభవంగా జరగనుంది
- మంత్రి సీతక్క సీఎంకి సమ్మక్క తల్లి కంకణం కట్టి ఆశీర్వదించారు
- ఈ జాతరకు కోట్లాది మంది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు
- జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది
- ప్రభుత్వం ఇప్పటికే 150 కోట్ల రూపాయలు కేటాయించింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం మహా జాతర2026 అధికారిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్కసారలమ్మ ఉత్సవాలు వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వైభవంగా జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దానసరి అనసూయ (సీతక్క) పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ముఖ్యమంత్రికి సమ్మక్క తల్లి కంకణం కట్టి, నుదుట బొట్టు పెట్టి ఆశీర్వదించారు. రెండేళ్లకోసారి వచ్చే ఈ వనదేవతల పండుగ కోసం ప్రభుత్వం ఇప్పటి నుంచే భారీ ఏర్పాట్లు ప్రారంభించింది. నాలుగు రోజుల పాటు సాగే ఈ జాతరకు దేశం నలుమూలల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివస్తారని అంచనా వేస్తున్నారు. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఈ జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. జాతర నిర్వహణ, అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 150 కోట్ల రూపాయలు కేటాయించింది. మాస్టర్ ప్లాన్ ప్రకారం గద్దెల విస్తరణ, రోడ్ల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పన పనులు వేగంగా సాగుతున్నాయి. రవాణా సౌకర్యం కోసం ఆర్టీసీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి 3,495 ప్రత్యేక బస్సులు

మిగతా 2లో..

## ఆరు గ్యారంటీల అమలు పట్టించుకున్నారా?

- సోనియా గాంధీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ
- కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల హామీల అమలును ప్రశ్నించారు
- విజన్ డాక్యుమెంట్‌పై అభినందించడాన్ని కిషన్ రెడ్డి తప్పుబట్టారు

02





03

## పండుగ వేళ రైల్వే బిగ్ షాక్

- రైల్వే మంత్రిత్వ శాఖ ప్రయాణికులకు భారీ షాక్ ఇచ్చింది
- ప్రయాణ టికెట్ ధరలు ఇక మరింత భారం కానున్నాయి
- ఒక్కసారిగా రైలు టికెట్ ఛార్జీలు అమాంతం పెరిగాయి

## గాదె ఇన్నయ్య అరెస్ట్

- మాజీ మావోయిస్టు గాదె ఇన్నయ్యను ఎన్ఐఏ అరెస్ట్ చేసింది
- జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో అదుపులోకి తీసుకున్నారు
- తీవ్రమైన అభియోగాలు నమోదు చేస్తూ చర్యలు చేపట్టింది



03

# రేవంత్ నీ పని అయిపోయింది..!

## తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ విస్తృతస్థాయి సమావేశం

- ఈ సందర్భంగా సీఎం రేవంత్, సీఎం చంద్రబాబులపై తీవ్ర ఆరోపణలు చేశారు
- సమైక్యాంధ్రలో మహబూబ్‌నగర్ ప్రాజెక్టుకు ద్రోహం చేశాయని ధ్వజమెత్తారు
- తెలంగాణ నదీ జలాలకు బీఆర్ఎస్ మాత్రమే శ్రీరామరక్ష అని వ్యాఖ్యానించారు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటే తెలంగాణకు చేసిన ద్రోహమని మండిపడ్డారు
- ఏపీ సీఎం చంద్రబాబు మోకాళ్లపై పరుగులు పెట్టి కాంపన్సేషన్ కట్టారు
- తెలంగాణ వెనుక బడిన ప్రాంతం కాదు వెనుకపడేయబడిన ప్రాంతం
- ఎస్ఐఆర్ తర్వాత గుజరాత్ ఓటర్ల సంఖ్య 4.34 కోట్లకు తగ్గింది
- సీఎం రేవంత్ రెడ్డి దిక్కుమాలిన మాటలన్నీ చెప్పి ప్రజలను మోసం చేశారు
- కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు శనిలా తయారైందని అన్నారు

02



## బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం

- జాగృతి జనం బాట కార్యక్రమంలో కవిత పర్యటించారు
- అలంపూర్‌లో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు
- రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమె పరిశీలించారు

03



# రేవంత్ నీ పని అయిపోయింది..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సమైక్యాంధ్రలో మహబూబ్‌నగర్ జిల్లా వివక్షకు గురైందని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సమైక్యాంధ్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మహబూబ్‌నగర్ ప్రాజెక్టుకు ద్రోహం చేశాయని ధ్వజమెత్తారు. తెలంగాణ నదీ జలాలకు బీఆర్ఎస్ మాత్రమే శ్రీరామరక్ష అని వ్యాఖ్యానించారు. తెలంగాణపై ఆర్తి బీఆర్ఎస్‌కు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు మరో ఉద్యమం చేపడదామని పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నేతలకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం ప్రధాన కారణం పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రానికి చేస్తున్న ద్రోహం ఏంటని?. రాష్ట్రంలో అత్యంత దారుణ పరిస్థితులకు లోనైన జిల్లా మహబూబ్ నగర్ జిల్లా. కృష్ణా నది ఈ జిల్లా నుంచే రాష్ట్రంలోకి వస్తుంది. జిల్లాలో 308 కి.మీ మేర కృష్ణా నది పారుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటే తెలంగాణకు చేసిన ద్రోహం. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు వివక్షకు గురైంది. ప్రతిపాదించిన ప్రాజెక్టుల ఎస్ఆర్సీ మార్చొద్దని కోరాం. గతంలో నీటి కేటాయింపు జరిగాయి. కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ ను చాలాసార్లు కోరాం. పాలమూరుకు 174 టీఎంసీలు రావాల్సి ఉంది.

17 టీఎంసీలు జూరాల ప్రాజెక్టు బచావత్ ట్రైబ్యునల్ కేటాయించింది. అంజయ్య ప్రభుత్వం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది. సీఎం చంద్రబాబు మహబూబ్ నగర్ జిల్లాను దత్తత తీసుకున్నారు. చాలా పునాది రాళ్లు వేశారు. ఆ పునాది రాళ్లను కృష్ణా నదిలో వేస్తే చెక్ డ్యామ్ అవుతుందని ఉద్యమ సమయంలో నేను అంటే నవ్వుకునేవారు. పాలమూరు నుంచి ప్రజలు ముంబైకి వలస పోయేవారు. ఉద్యమ కవులు పాలమూరు కరువుపై చాలా పాటలు రాశారు' అని కేసీఆర్ అన్నారు.

సమైక్య రాష్ట్రంలోనే సమగ్ర అభివృద్ధి అని అప్పట్లో చంద్రబాబు స్లోగన్ ఇచ్చారు. నేను ఓ సభలో జూరాల ప్రాజెక్టు కోసం కర్ణాటకకు కాంపన్సేషన్ ఎందుకు కట్టరని ప్రశ్నిస్తే.. చంద్రబాబు మోకాళ్లపై పరుగులు పెట్టి కాంపన్సేషన్ కట్టారు. ఆర్డీఎస్ కోసం నేను గొడవ చేస్తే.. జూరాలకు లింక్ కెనాల్ స్టార్ చేశారు. ఇలా కొట్లాడితే.. చివరకు తెలంగాణ ఏర్పడింది. పాలమూరు జిల్లాను దరిద్రంలోకి నెట్టివేశారు. తెలంగాణ వెనుకబడిన ప్రాంతం కాదు వెనుకపడేయబడిన ప్రాంతం. పాలమూరులో కొన్ని సంవత్సరాల క్రితం గంజి




కేంద్రాలు పెట్టారు. కృష్ణా నది 300 కి.మీ పారే జిల్లాలో గంజి కేంద్రాలు పెట్టే స్థాయికి చేరిపోయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టులకు పెండింగ్ ప్రాజెక్టులు అని పేరు పెట్టారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఇదొక సర్వ భ్రష్ట ప్రభుత్వమని ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ''సర్వంలో భ్రష్టం ఇది. రాష్ట్రం ఒక క్రమ పద్ధతిలో పోతూ ఉండింది. కానీ, ఈ రోజు పరిస్థితి ఏంది?. జంట నగరాల్లో నడిరోడ్డుపై పట్టపగలు హత్యలు జరుగుతున్నాయి. అడిగే దిక్కు లేదు. మానభంగాలు, రేపులు జరుగుతున్నాయి. ఎన్‌సీఆర్‌బీ రిపోర్టు ప్రకారం రాష్ట్రంలో నేరాలు 20 శాతం పెరిగాయి. ప్రశాంతంగా ఉండే రాష్ట్రం కాస్త ఇలా తయారైంది. ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండేది. అవన్నీ రాష్ట్రంలో మృగ్యం అయిపోతున్నాయి. అన్ని చూసుకుంటూ రికార్డ్ చేస్తున్నాం. అన్నింటిపైనా చర్చించుకుంటున్నాం'' అని అన్నారు. వాగ్దానాలు ఏమిచ్చారు?, ఏం అమలు చేశారు? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేసీఆర్ ప్రశ్నించారు. ''మాకు ఓటు వేసే ఉద్దేశం ఉన్న ప్రజలను పచ్చి అబద్దాలు, టెంప్ట్ చేసి, దొంగ మాటలు, మాయమాటలు చెప్పి, వేలంపాట పాడినట్టు చేశారు. రైతు బంధుకు కేసీఆర్ రూ.10 వేలు ఇస్తాడు. మేము రూ.15 వేలు ఇస్తామని ప్రచారం చేశారు. కళ్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం కూడా ఇస్తామన్నారు. కొన్ని పెళ్లిళ్లు కూడా ఆపారు. డిసెంబర్‌లో చేసుకుంటే తులం బంగారం వస్తదని ఊదరగొట్టారు. డిసెంబర్‌లో తీసుకుంటే వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ వస్తుందని అన్నారు'' అని కేసీఆర్ అన్నారు. రెండేళ్లపాటు ఎదురుచూశామని, ఇకపై రాష్ట్రంలో ఉద్యమాలు ఉంటాయని కేసీఆర్ హెచ్చరించారు. ''దిక్కుమాలిన మాటలన్నీ చెప్పి, నేడు కనీసం వడ్లు కొనడం లేదు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామంటూ ప్రకటించారు. కానీ, నేడు పంటలు కూడా కొనే దిక్కులేదు. రైతులు దోపిడీకి కూడా గురవుతు ప్రైవేటు వాళ్లకు అమ్ముకుంటున్నారు. చివరికి యూరియా పంపిణీ చేసే తెలివితేటలు కూడా లేవా?. మా ప్రభుత్వంలో ఒక ఆటోరిక్షావాడిని పిలిచి ఒక 10 బస్తాల యూరియా తెచ్చిపెట్టమంటే , తీసుకెళ్లి పొలం కాడ పడేసేవాడు. రైతులు చెప్పులను క్యూలో పెట్టాల్సి వచ్చింది. మళ్లీ ఇప్పుడేదే యాపో బోపో తెచ్చారు. అది నడవట్లేదు. పీకట్లేదు. ఎరువు బస్తాకు యాప్ ఎందుకు? నాకర్థం కాదు'' అని కేసీఆర్ అన్నారు.

''తెలంగాణ ఏర్పడిన తర్వాత పూర్తిగా సర్వే చేశాను. పాలమూరు జిల్లాను బయటపడేసేందుకు కృషి చేశారు. పెండింగ్ ప్రాజెక్టులకు రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 6.5 లక్షల ఎకరాలను సాగులోకి తెచ్చాము. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ఫేజ్ 1,2 ద్వారా లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చాం. 300 కిలో మీటర్ల కృష్ణా నది ఉన్న రాష్ట్రంలో 30 ఎకరాల సాగు కూడా లేదు. అందుకే పాలమూరును వలసల జిల్లా అనేవారు. మిషన్ కాకతీయలో పాలమూరుకు టాప్ ప్రయారిటీ ఇచ్చాం. చాలా వాగులపై చెక్ డ్యామ్ లు కట్టాం. తుంగభద్రపై తుమ్మిళ్ల లిఫ్ట్ స్టార్ట్ చేసి ఆయకట్టుకు పారించాం'' ''రంగారెడ్డి జిల్లా కూడా కృష్ణా నది ఆయకట్టే. నల్గొండ, రంగారెడ్డి, పాలమూరు కృష్ణా నది ఆయకట్టులోనే ఉన్నాయి. అందుకే రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణా జలాల వాటాలపై కొట్లాడాలని నిర్ణయించాం. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 174 టీఎంసీలు తీసుకోవాలి. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వ స్ట్రాటజీ. పాలమూరు చెరువుల లెక్కలు తీసి కేంద్రానికి చెప్పాం. అప్పటి లెక్కల ప్రకారం 90.81 టీఎంసీలు పాలమూరురంగారెడ్డికి కేటాయించాం. ఆంధ్రా వాళ్లు లిఫ్ట్ పెట్టి 80 టీఎంసీలు వాడుకుంటున్నారు. పోలవరం నుంచి ఏపీ నీళ్లు తీసుకుంటుందని.. కర్ణాటక, మహారాష్ట్ర కృష్ణా నీళ్లు వాడుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధ్యయనం చేసి పాలమూరురంగారెడ్డికి 90.81 టీఎంసీలు కేటాయించాం.

ప్రాజెక్టుకు 145 మెగావాట్స్ కెపాసిటీతో పంపులు పెట్టాం. దేశంలో ఎక్కడా ఇలాంటివి. ఏపీతో పోతిరెడ్డిపాడు, తెలుగు గంగా పంచాయితీ ఉంది కాబట్టి.. ఇంత కెపాసిటీ పంపులు పెట్టి కాలువలు నింపాం. ఈ ప్రాజెక్టు కోసం 27 వేల ఎకరాలు భూసేకరణ చేసి, 27 వేల కోట్లు ఖర్చుపెట్టాం. ఇంతలో మా ప్రభుత్వం మారింది. ఇంత ఖర్చు పెట్టిన ప్రాజెక్టును ఏ ప్రభుత్వం వచ్చినా కొనసాగిస్తారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరురంగారెడ్డిలో ఒక తట్టెడు మట్టి కూడా తీయలేదు'' అని కేసీఆర్ విమర్శించారు.

''కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు శనిలా తయారైంది. ప్రాజెక్టు కావాల్సిన అనుమతులు కూడా తెచ్చాం. అన్ని వచ్చిన తర్వాత కూడా.. కేంద్రంలోని బీజేపీ చంద్రబాబు మాటలు పట్టుకుని డీపీఆర్ వాపస్ పంపారు. డీపీఆర్ వాపస్ వస్తే రాష్ట్ర ప్రభుత్వం ఎంత హడావుడి చేయాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం స్పందించలేదు. వడ్లు కొనకపోతే బీఆర్ఎస్ ఢిల్లీలో పోరాటం చేసింది. కానీ కాంగ్రెస్ మాత్రం మౌనంగా ఉండిపోయింది. రాష్ట్రం విడిపోయిన తర్వాత కొన్ని విభజన అంశాలు ఉంటాయి. నీటి తగాదాలపై మేము ఒక డిసైడ్ చేశాం. ఒక సంవత్సరం తర్వాత కేంద్రాన్ని రిక్వెస్ట్ చేశాం. కానీ స్పందించలేదు. దీంతో సుప్రీంకోర్టుకు వెళ్లాం. కోర్టు కేంద్రానికి మొట్టికాయలు వేసింది. నీటి పంపకాలు చేయండని సుప్రీంకోర్టు చెప్పడంతో.. కేంద్రం నీటి కేటాయింపులపై సెక్షన్ 3 వేసింది. బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్ పై వాదనలు జరుగుతున్నాయి. తొందరలో తీర్పు వస్తుంది'' కేసీఆర్

''75 శాతం నీటి ఆధారితంపై కేటాయింపులు జరగాలి. కానీ బ్రిజేష్ కుమార్ ఏం చెప్పారంటే వర్షాలు బాగా పడుతున్నాయని 65 శాతానికి మార్చారు. దీంతో మనకు కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా పెరుగుతుంది. దీంతో పాలమూరుకు 170 టీఎంసీల వరకూ రావాలి. పాలమూరులోని నియోజకవర్గానికి లక్ష ఎకరాలు నీళ్లు పారాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. డీపీఆర్ వెనక్కి పంపితే ఈ దద్దమ్మ ప్రభుత్వం చప్పుడు చేయడంలేదు. ఇప్పుడు ఇరిగేషన్ మంత్రి 45 టీఎంసీలు ఇవ్వాలని కేంద్రానికి లెటర్ రాశారు. మనకు రావాల్సిన వాటా కంటే తక్కువగా వాటా అడుగుతున్నారు. ట్రైబ్యునల్ తీర్పుతో వచ్చిన వాటాను కూడా ఎందుకు ఆపుతున్నారు. ఎప్పుడూ రియల్ ఎస్టేట్ దందా తప్ప రాష్ట్ర ప్రయోజనాలు లెక్క లేదా? ఎందుకు ప్రాజెక్టులు కట్టడంలేదు. దీని వెనుక ఏం కుట్ర ఉంది. రెండేళ్ల నుంచి నేను మౌనంగా ఉన్నాం. ఇప్పుడు ఉద్యమానికి సిద్ధమయ్యా. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండలో భారీ బహిరంగ సభలు, గ్రామగ్రామాన ప్రజా ఉద్యమాలు చేస్తాం'' అని కేసీఆర్ అన్నారు.

# తెలంగాణలో 'సర్'

( మొదటిపేజీ తరువాయి )

కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది జులైలో కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించడం చాలా ముఖ్యమని స్పష్టం చేసింది. ఓటర్ల జాబితాల సమగ్రతను కాపాడటానికి దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంభించాలని నిర్ణయం తీసుకుంది. దేశంలోని అన్ని ప్రాంతాల్లోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం షెడ్యూల్ ను నిర్ణీత సమయంలో జారీ చేస్తామని వెల్లడించింది. ఈ క్రమంలో తాజాగా తెలంగాణలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ ఉండనున్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తాజాగా స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణ పర్యటనలో ఉన్న జ్ఞానేశ్ కుమార్ ఇవాళ హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలవుతోందని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కెనడా కంటే తెలంగాణ పెద్దది అని తెలిపారు. తొలుత బీహార్ రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా సర్ నిర్వహించారు. ఈ ప్రక్రియ ఇప్పటికే అక్కడ పూర్తయింది. రెండోవిడతలో 9 రాష్టాలు, 3 కేంద్రపాలిత (ఉత్తరప్రదేశ్, తమిళనాడు, పశ్చిమబెంగాల్, రాజస్థాన్, కేరళ, మధ్యప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, గోవా, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్, లక్షద్వీప్) ప్రాంతాల్లో నిర్వహిస్తామని అక్టోబర్ 27న ఈసీఐ ప్రకటించింది, ఈ మేరకు ప్రక్రియ కొనసాగుతున్నది కూడా. ఇక మూడో విడత తెలంగాణతోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో ప్రారంభం కానున్నట్టు ఈసీఐ వర్గాల ఏర్పాట్లను చూస్తే తెలిసిపోతున్నది. సర్ ప్రక్రియ మూడో విడతలో భాగంగా తెలంగాణలో ప్రారంభం కానున్నది. ప్రస్తుతం తెలంగాణ ఎన్నికల అధికారులు సర్వే కోసం క్షేత్రస్థాయిలో సన్నద్ధమవుతున్నారు. తాజా సమాచారం ప్రకారం ఆదివారం భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ హైదరాబాద్ రవీంద్రభారతిలో బూత్‌స్థాయి అధికారులతో (బీఎల్‌వోల) కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,000 మందికిపైగా బీఎల్‌వోలు సమావేశానికి హాజరుకానున్నారు. సర్ ప్రక్రియలు అనుసరించాల్సిన విధివిధానాలు,



నిబంధనలు, సూచనలు, సలహాలు సహా పలు అంశాలపై దిశానిర్దేశం చేయనున్నట్టు ఈసీఐ వర్గాలు చెబుతున్నాయి. సమావేశం అనంతరం తెలంగాణలో ఇంటింటి సర్వే, దరఖాస్తుల స్వీకరణకు సంబంధించిన కచ్చితమైన షెడ్యూల్ వెలువడే అవకాశాలున్నట్టు పేర్కొంటున్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారు. గతంలో ఉన్న ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడానికి ప్రతి ఇంటికీ వస్తారు. ఎన్యుమరేషన్ ఫారమ్ (ఈఎఫ్)ను ప్రతి ఓటరుకూ అందిస్తారు. అందులో వివరాలను సరిచూసుకుని సంతకం చేయాల్సి ఉంటుంది. 2003 ఓటర్ల జాబితాలో పేరు ఉన్నవారు లేదా వారి వారసులైతే అదనపు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని ఈసీ తెలిపింది. కొత్తగా నమోదు చేసుకునే వారు నివాస, వయస్సు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. మరణించిన వారు, శాశ్వతంగా ఆ గ్రామం నుంచి వలస వెళ్లిన వారి ఓట్లను తొలగిస్తారు. డూప్లికేట్ ఓట్లను తొలగించడం ఈ సర్వే ప్రధాన ఉద్దేశమని ఈసీఐ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో సర్ నిర్వహణ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (ఎస్ఈసీ) సుదర్శన్‌రెడ్డితో ఈసీఐ ఇప్పటికే రెండుసార్లు ఢిల్లీలో సమావేశాలు నిర్వహించింది. ఆ తర్వాత ఎస్ఈసీ జిల్లాల ఎన్నికల అధికారులు, అసిస్టెంట్ ఎన్నికల అధికారులతో మూడుసార్లు వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి 'సర్'పై వారికి బ్రీఫింగ్ ఇచ్చినట్టు తెలిసింది. అందులో భాగంగా ఎస్ఈసీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఫీల్డ్ విజిట్ కూడా చేశారు, అక్కడి బీఎల్‌వోలకు ప్రాథమిక శిక్షణ కూడా ఇచ్చారు. ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారమ్, ఓట్ల తొలగింపు. కొత్త ఓటర్లను నమోదు చేయడంపై అవగాహన కల్పించారు.

# మహాజాతర పోస్టర్ విడుదల చేసిన సీఎం

( మొదటిపేజీ తరువాయి )

నడపాలని అధికారులు నిర్ణయించారు. వీటితో పాటు భద్రత, పారిశుధ్యం విషయంలోనూ అధికారులు కట్టుదిట్టమైన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందిన మేడారం జాతర వెనుక గొప్ప చారిత్రక నేపథ్యం ఉంది. 13వ శతాబ్దంలో కాకతీయ పాలకుల అన్యాయాలకు వ్యతిరేకంగా, గిరిజన హక్కుల కోసం పోరాడి వీరమరణం పొందిన తల్లీకూతుళ్లు సమ్మక్క, సారలమ్మలను ఇక్కడ దేవతలుగా కొలుస్తారు. అడవి బిడ్డల ఆత్మగౌరవానికి, పోరాట పటిమకు ప్రతీకగా ఈ జాతర నిలుస్తుంది. కోరిన కోర్కెలు తీర్చే వనదేవతలుగా భక్తుల నమ్మకం. అందుకే కులమతాలకు అతీతంగా, కేవలం తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా వంటి పొరుగు రాష్ట్రాల నుంచి కూడా జనం తండోపతండాలుగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ ఉత్సవంలో ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. మొదటి రోజు కన్నెపల్లి నుంచి సారలమ్మ గద్దెపైకి వస్తుంది. రెండో రోజు చిలుకలగుట్ట నుంచి సమ్మక్క తల్లిని గద్దెపైకి తీసుకువస్తారు. మూడో రోజు ఇద్దరు అమ్మవార్లు గద్దెలపై కొలువుదీరి భక్తులకు దర్శనమిస్తారు. ఈ రోజే భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుంది. భక్తులు తమ ఎత్తు బెల్లం (బంగారం) తూచి అమ్మవార్లకు సమర్పించుకోవడం ఇక్కడ ఆనవాయితీ. చివరి రోజు అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది. ఈ మహా క్రతువును కనులారా వీక్షించేందుకు భక్తులు ఇప్పటి నుంచే ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అనంతరం శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రముఖులకు తేనీటి విందుతో ఆతిథ్య



మిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సహా పలువురు ప్రజాప్రతినిధులు హాజరై ఆతిథ్యాన్ని స్వీకరించారు. రాష్ట్రపతి ప్రతి ఏటా శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చే ఆనవాయితీ ఉంది. వేసవి కాలం విడిది కోసం సిమ్లా వెళ్తుంటారు. ఈ కార్యక్రమంలో అతిథులకు నోరూరించే వంటలు వడ్డించారు. డిసెంబరు 17న హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ముర్ము ఐదు రోజుల పాటు ఇక్కడే ఉన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని ముగించుకొని ముర్ము ఢిల్లీకి బయల్దేరే అవకాశం ఉంది.

# బంగ్లాదేశీ చొరబాటుదారులకు కాంగ్రెస్ రక్షణ

- **కాంగ్రెస్ పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విరుచుకుపడ్డారు**
- **బంగ్లా దేశీయులు భారత్‌లోకి స్థిరపడేందుకు సాయం చేస్తున్నారు**
- **కాంగ్రెస్ హయాంలో రైతుల కష్టాలను వినే నాథుడే లేడని ఆరోపించారు**
- **మోదీ బ్రౌన్ ఫీల్డ్ యూరియా ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు**
- **కాంగ్రెస్ పాలనలో ఎరువుల ప్లాంట్‌లు మూతపడ్డాయని దుయ్యబట్టారు**
- **కాంగ్రెస్ పార్టీ దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో మునిగిపోయిందని మండిపడ్డారు**

**విశాలభారతి, నేషనల్:**

దేశవ్యతిరేక కార్యకలాపాలతో పాటు అక్రమంగా బంగ్లా దేశీయులు భారత్‌లోకి స్థిరపడేందుకు సాయం చేస్తున్నారంటూ కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ. కాంగ్రెస్ హయాంలో రైతుల కష్టాలను వినే నాథుడే లేకుండాపోయాడని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే రైతు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అసోంలో



రెండో రోజూ పర్యటించిన ప్రధాని మోదీ, డిబ్రూగడ్‌లో రూ. 10 వేల 601 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన బ్రౌన్ ఫీల్డ్ యూరియా ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 'ది అస్సాం వ్యాలీ ఫెర్టిలైజర్ కంపెనీ లిమిటెడ్' 2030 నాటికి ఏటా 12.7లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ యూరియా ప్లాంట్‌ను నిర్మించనుంది. కాంగ్రెస్ పాలనలో సాంకేతికత పాతదైపోయి ఎరువుల ప్లాంట్‌లు మూతపడినప్పటికీ పట్టించుకోలేదని ప్రధాని దుయ్యబట్టారు. 2014లో దేశంలో యూరియా ఉత్పత్తి 225 లక్షల మెట్రిక్ టన్నులు ఉండగా పది, 11 ఏళ్లు కష్టపడిన తర్వాత అది 306 లక్షల మెట్రిక్ టన్నులకు చేరిందని మోదీ వివరించారు. అసోం మాదిరిగానే దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ (కాంగ్రెస్ పాలనలో) అనేక యూరియా పరిశ్రమలు మూతపడ్డాయి. అప్పుడు రైతులు పడిన కష్టాలు గుర్తుకు తెచ్చుకోండి. యూరియా కోసం రైతులు బార్లు తీరేవారు. యూరియా దుకాణాల్లో పోలీసులను మోహరించేవారు. రైతులపై లాఠీఛార్జ్ చేసేవారు. కాంగ్రెస్ చెడగొట్టిన ఈ వ్యవస్థలను సరిచేసేందుకు మా ప్రభుత్వం మొత్తం శక్తినంతా ఉపయోగిస్తోంది. ఎంతచేసినా సరే 11 ఏళ్ల తర్వాత కూడా ఇంకా మేము చేయాల్సింది చాలా ఉండిపోయింది. కాంగ్రెస్ పాలనలో యూరియా పరిశ్రమలు మూతపడ్డాయి. మా ప్రభుత్వం గోరఖ్‌పూర్, సింద్రీ, బరౌనీ, రామగుండం వంటి అనేక ప్లాంట్లను తిరిగి ప్రారంభించింది. ఈ చర్యల వల్ల యూరియా రంగంలో స్వయం స్వావలంబన సాధించే దిశగా బలమైన అడుగులు పడుతున్నాయి అని మోదీ అన్నారు.

"కాంగ్రెస్ పార్టీ దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో మునిగిపోయింది. అసోంలోకి బంగ్లాదేశ్ అక్రమ చొరబాటుదారులు రావడం వారికి కావాలి. ప్రతిపక్ష పార్టీకి అసోం ప్రజల అస్థిత్వం, గౌరవంపై ఆందోళన లేదు. అధికారంలోకి రావడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసమే ఓటర్ జాబితా సవరణను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. నేను ఏదైనా మంచి చేద్దాం అనుకుంటే కాంగ్రెస్ దానికి అడ్డుపడుతుంది. అసోం ప్రజల ఆత్మగౌరవానికి, గుర్తింపును, భూమిని కాపాడేందుకు బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుంది. అసోంను శక్తిమంతమైన రాష్ట్రంగా చేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యం. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అసోం యువత కలలు నిజం చేసేందుకు కృషి చేస్తోంది." అని నరేంద్ర మోదీ అన్నారు. అంతకుముందు అసోం ఉద్యమంలో అమరులైనవారికి ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. పశ్చిమ బొరగావ్‌లో స్వాహిద్ స్మారకాన్ని సందర్శించిన మోదీ, అసోం ఉద్యమంలో అమరులైన 860 మందికి నివాళులు అర్పించారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మ అమరుల వివరాలను ప్రధానికి వివరించారు. అంతకుముందు బ్రహ్మపుత్ర నదిలో క్రూయిజ్‌లో మోదీ ప్రయాణించారు. క్రూయిజ్‌లోనే 'పరీక్షా పే చర్చ'లో భాగంగా ప్రతిభావంతులైన 25 మంది విద్యార్థులతో ఆయన ముచ్చటించారు.

అయితే, ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత, లోక్‌సభ ఎంపీ మాణికం ఠాగూర్ స్పందించారు. ఈ ఆరోపణల్ని ఎక్స్ వేదికగా ఖండించారు. అస్సాంను పాకిస్తాన్‌కు అప్పగించే ప్రతిపాదన లేదని ఆయన అన్నారు. అస్సాం హిందూ మెజారిటీ ప్రావిన్స్ అని, విభజన ప్రణాళికలో పాకిస్తాన్ భాగంగా అస్సాం లేదని, అస్సాంలోని సిల్హెట్ జిల్లా ముస్లిం మెజారిటీ ప్రాంతం అని ఆయన అన్నారు. ఇప్పుడు సిల్హెట్ జిల్లా బంగ్లాదేశ్‌లో భాగంగా ఉంది. అస్సాం మొదటి సీఎం, కాంగ్రెస్ నేత గోపీనాథ్ బోర్డోలోయ్ పేరు మీద ఉన్న గౌహతి ఎయిర్‌పోర్ట్‌లో మోదీ కొత్త టెర్మినల్ ప్రారంభించారు. అస్సాంను రక్షించడానికి బోర్డోలోయ్ కాంగ్రెస్‌ను ధిక్కరించారని ప్రధాని అనినారు. అస్సాం గుర్తింపును నాశనం చేసే చర్యల్ని ఆయన వ్యతిరేకించారని, అస్సాం దేశం నుంచి వేరు కాకుండా కాపాడారని ప్రధాని అన్నారు. అయితే, మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ఠాగూర్ స్పందిస్తూ.. జూలై 1947లో బ్రిటీష్ అధికారంలో ఉన్న సిల్హెట్ జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగిందని, ఆ తర్వాత అది తూర్పు బెంగాల్‌లో ఆ తర్వాత తూర్పు పాకిస్తాన్‌లో భాగమైదని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ నిర్ణయం కాదని గోపీనాథ్ బోర్డోలోయ్ ప్రయత్నాల కారణంగా కరీంగంజ్ సబ్ డిస్ట్రిక్ట్ భారత్‌లోనే ఉంచబడిందని చెప్పారు. ప్రధానిపై విమర్శలు చేస్తూ.. మోదీ శిక్షణ పొందిన ఆర్ఎస్ఎస్ వ్యక్తి అని, అబద్ధాలు వ్యాప్తి చేయడం ద్వారా జీవిస్తున్నారని అన్నారు.

# ఆరు గ్యారంటీల అమలు పట్టించుకున్నారా?

- **సోనియా గాంధీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ**
- **కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల హామీల అమలును ప్రశ్నించారు**
- **విజన్ డాక్యుమెంట్‌పై అభినందించడాన్ని కిషన్ రెడ్డి తప్పుబట్టారు**
- **ఆమె ప్రభుత్వాన్ని అభినందించడాన్ని కిషన్ రెడ్డి తప్పుబట్టారు**
- **ఆరు గ్యారంటీలు అమలు పరిస్థితి ఏమిటో ఇప్పటికీ స్పష్టత లేదు**
- **మేనిఫెస్టోని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీకి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. అందులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరును, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల హామీల అమలును ప్రశ్నించారు. ఇటీవల రేవంత్ రెడ్డి తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047పై, రెండేళ్ల పాలనపై ఢిల్లీకి వెళ్లి ఇచ్చిన రిపోర్టును సోనియా గాంధీ మెచ్చుకోవడాన్ని కిషన్ రెడ్డి తన లేఖలో తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో సోనియా గాంధీకి అందజేసినప్పుడు, ఆమె ప్రభుత్వాన్ని అభినందించడాన్ని కిషన్ రెడ్డి తప్పుబట్టారు. గత రెండు ఏళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధిపై రేవంత్ రెడ్డికి ఉన్న దూరదృష్టిని మెచ్చుకోవడం కంటే, ప్రజలకు ఇచ్చిన హామీల పరిస్థితి ఏమిటో తెలుసుకోవాలని ఆయన సూచించారు. తుక్కుగూడ సభలో సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, అభయ హస్తం మేనిఫెస్టోలోని హామీల అమలు పరిస్థితి ఏమిటో ఇప్పటికీ స్పష్టత లేదు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సాక్షిగా ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించడం లేదని కిషన్ రెడ్డి ఆరోపించారు. కొత్త ఆశలు కల్పించే ముందు.. పాత హామీల అమలును పరిశీలించాల్సిన బాధ్యత సోనియా గాంధీపై ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఆ లేఖలోని ప్రధాన అంశాలు ఇలా ఉన్నాయి.

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తుక్కుగూడ సభలో సోనియా గాంధీ స్వయంగా ప్రకటించిన 6 గ్యారంటీలు ఏమయ్యాయని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. అధికారం చేపట్టి రెండేళ్లు పూర్తవుతున్నా, మేనిఫెస్టోలో చెప్పిన అంశాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని, కనీసం ముఖ్యమంత్రిని వీటి గురించి అడిగి తెలుసుకునే ప్రయత్నం కూడా చేయలేదని తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, ఇప్పుడు వాటిని పక్కన పెట్టి 'విజన్ డాక్యుమెంట్' పేరుతో కొత్త పల్లవి అందుకున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఆరు గ్యారంటీ హామీలను గాలికొదిలేసి ప్రజలను వంచిస్తున్నారని, ఈ తీరు ఇలాగే కొనసాగితే కాంగ్రెస్ ఇచ్చిన అభయహస్తమే భస్మాసుర హస్తంగా మారి ఆ పార్టీని అధికారానికి దూరం చేస్తుందని కిషన్ రెడ్డి హెచ్చరించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులు, దళితులు మరియు వెనుకబడిన వర్గాలకు ఇచ్చిన వాగ్దానాల విషయంలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట మీద నిలబడకపోతే భవిష్యత్తులో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని కిషన్ రెడ్డి తన లేఖ ద్వారా హెచ్చరించారు.

పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ తీర్పు ఇవ్వడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. గ్రామంలో సర్పంచ్‌గా గెలవాలంటే ఎంతో పట్టుదల కావాలన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు చూస్తే.. ఆ పట్టుదల ప్రతి కార్యకర్తలో కనిపించిందని కొనియాడారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన తెలంగాణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో 100 రోజులు ఉన్న పనిదినాలను 125 రోజులకు పెంచిన ఘనత మోదీదేనన్నారు. వచ్చే ఎన్నికలు పార్టీ గుర్తుల మీద



జరుగుతాయని, ప్రజలు బీజేపీని ఆదరించడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సమన్వయంగా ఒక కార్యాచరణతో ప్రతి కార్యకర్త ముందుకువెళ్లాలన్నారు. ఆ ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే అని కిషన్ రెడ్డి విమర్శించారు. ఫిరాయింపులను ప్రోత్సహించే రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. 10 మది ఎమ్మెల్యేలు సిగ్గులేకుండా కాంగ్రెస్‌లోకి వెళ్లారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనూ ఇదే తంతు కొనసాగిందని ధ్వజమెత్తారు.

# పండుగ వేళ రైల్వే బిగ్ షాక్

- రైల్వే మంత్రిత్వ శాఖ ప్రయాణికులకు భారీ షాక్ ఇచ్చింది
- ప్రయాణ టికెట్ ధరలు ఇక మరింత భారం కానున్నాయి
- ఒక్కసారిగా రైలు టికెట్ ఛార్జీలు అమాంతం పెరిగాయి
- ఈ నెల 26వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి
- 215 కిమీ కంటే ఎక్కువ దూరం ప్రయాణించే వారిపై అదనపు భారం
- రూ. 600 కోట్ల రూపాయకు పైగా అదనపు ఆదాయాన్ని ఆశిస్తోంది



**విశాలభారతి, నేషనల్:**

దేశవ్యాప్తంగా లక్షలాదిమంది ప్రయాణికులకు భారీ షాక్ ఇచ్చింది రైల్వే మంత్రిత్వ శాఖ. రైలు ఛార్జీలు అమాంతం పెరిగాయి. ప్రయాణ టికెట్ ధరలు ఇక మరింత భారం కానున్నాయి. పెరిగిన టికెట్ ఛార్జీలు ఈ నెల 26వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. అన్ని మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల టికెట్ ధరలు ఒక్కసారిగా జంప్ అయ్యాయి. వాటిని పెంచుతున్నట్లు రైల్వే శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. దూర ప్రయాణాలు చేసే వారికి ఈ ధరల పెంపు అదనపు భారం కానుంది. రైల్వే ప్రకటించిన కొత్త ఛార్జీల్లో 215 కిలోమీటర్ల లోపు సాధారణ తరగతి రైలు ప్రయాణాలపై ఎటువంటి భారం ఉండదు. అంటే ఈ దూరం వరకు ఛార్జీలు పెరగవు. ఇప్పుడున్న టికెట్ ఛార్జీలే యధాతథంగా కొనసాగుతాయి. 215 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ప్రయాణించే వారిపై అదనపు భారం పడుతుంది. సాధారణ తరగతి వారికి కిలోమీటరుకు ఒక పైసా పెరగనుంది. మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని నాన్ ఏసీ, ఏసీ తరగతులకు కిలోమీటరుకు రెండు పైసలు చొప్పున అదనంగా వసూలు చేస్తారు.

ఈ టికెట్ ధరల పెంపు ద్వారా రైల్వే శాఖ సుమారు 600 కోట్ల రూపాయకు పైగా అదనపు ఆదాయాన్ని ఆశిస్తోంది. ఒక ప్రయాణికుడు 500 కిలోమీటర్ల దూరాన్ని నాన్ ఏసీ మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తే.. ప్రస్తుత టికెట్ ధరతో పోలిస్తే అదనంగా 10 రూపాయల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన దూర ప్రయాణాలపై ప్రభావం గణనీయంగా ఉంటుంది. సబర్బన్ రైలు సర్వీసులు, నెలవారీ టిక్కెట్ల ధరలలో ఎటువంటి మార్పు ఉండదు. తక్కువ ఆదాయ వర్గాల వారు, రోజువారీ ప్రయాణీకులకు అందుబాటులో ఉండేలా 215 కిలోమీటర్ల లోపు ఎటువంటి ఛార్జీలను పెంచట్లేదని రైల్వే పేర్కొంది. ఇటీవలి కాలంలో నిర్వహణ ఖర్చులు గణనీయంగా పెరిగాయని రైల్వేలు భావిస్తోన్నాయి. మానవ వనరుల కోసమే ఏకంగా 1.15 లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేయాల్సి వస్తోందని, దీనికి అదనంగా పెన్షన్ వ్యయం 60,000 కోట్ల రూపాయలకు చేరాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. 202425 ఆర్థిక సంవత్సరంలో మొత్తం నిర్వహణ వ్యయం 2.63 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుంది. నెట్‌వర్క్ విస్తరణ, భద్రతా ప్రమాణాలను మెరుగుపరిచే ప్రయత్నాలకు అధిక సిబ్బంది అవసరం పడుతుందని, ఇది ఖర్చులను పెంచుతుందని అధికారులు వివరించారు. పెరుగుతున్న ఖర్చులను ఎదుర్కోవడానికి, పరిమిత ప్రయాణీకుల ఛార్జీల హేతుబద్ధీకరణతో పాటు సరుకు రవాణాను పెంచడంపై రైల్వేలు దృష్టి సారించాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా ఉండే రద్దీని దృష్టిలో పెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే విస్తృత ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే 124 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నామని, అవసరమైతే జంట నగరాల నుంచి సుమారు 600 వరకు ప్రత్యేక రైళ్లను నడిపేందుకు సిద్ధంగా ఉన్నామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, చర్లపల్లి, లింగంపల్లి స్టేషన్ల నుంచి బయలుదేరతాయని తెలిపారు. సంక్రాంతి పండుగకు ఇంకా 20 రోజుల సమయం ఉన్నప్పటికీ.. ముందస్తు బుకింగ్‌ల వల్ల ఇప్పటికే ప్రకటించిన రైళ్లలో రిజర్వేషన్లు వేగంగా నిండిపోతున్నాయి. మరీ ముఖ్యంగా విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, శ్రీకాకుళం, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి మార్గాల్లో ప్రయాణికుల నుంచి భారీ డిమాండ్ ఉంది. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకుని.. జనవరి 24 వరకు 400కు పైగా ప్రత్యేక రైళ్లు నడిపేలా ప్రణాళిక రూపొందించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈసారి హైదరాబాద్ నుంచి రైళ్ల ద్వారా 30 లక్షల మందికి పైగా ప్రయాణించే అవకాశం ఉందని అంచనా వేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. అయినా సరే ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రతా చర్యలు తీసుకుంటున్నామని.. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. అయితే, ఈ ప్రత్యేక రైళ్లలో అదనపు ఛార్జీలు వర్తిస్తాయని దక్షిణ మధ్య రైల్వే స్పష్టం చేసింది. ఇటీవలి పండగ సీజన్‌లో 12,000కు పైగా అదనపు రైళ్లను విజయవంతంగా నడపడం మెరుగైన ప్రణాళిక, సామర్థ్యానికి నిదర్శనమని రైల్వేలు పేర్కొన్నాయి. దేశవ్యాప్తంగా ప్రయాణీకులకు సురక్షితమైన, సరసమైన ప్రయాణాన్ని అందించడానికి, సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, ఖర్చులను నియంత్రించడానికి ప్రయత్నాలు కొనసాగుతాయని చెబుతున్నాయి.

## దమ్ముంటే అసెంబ్లీకి రా కేసీఆర్..!



**( మొదటిపేజీ తరువాయి )**

కేసీఆర్ ఆరోగ్యంగా ఉండి అసెంబ్లీకి రావాలని తాను కోరుకుంటుంటే, ఆయన వారసులే ఆయన రాజకీయ ఉనికిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై చర్చించడానికి జనవరి 2 నుంచి అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. కేసీఆర్ అబద్ధాలు చెప్పడం మానేసి, ధైర్యముంటే అసెంబ్లీకి వచ్చి ముఖాముఖి చర్చల్లో పాల్గొనాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాళేశ్వరం అవినీతి, ఇతర పాలనాపరమైన విచారణలపై కూడా తాము చిత్తశుద్ధితో ఉన్నామని, దీనిపై కేంద్రం నుంచి రావాల్సిన అనుమతుల గురించి ప్రశ్నిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ కుటుంబంలో వారసత్వ పోరు తారాస్థాయికి చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ రాజకీయాల నుండి తప్పుకున్నాక లేదా ఆయన లేని పక్షంలో తన దారి తాను చూసుకుంటానని హరీష్ రావు ఇప్పటికే చెప్పకనే చెప్పారని రేవంత్ పేర్కొన్నారు. పార్టీలో కేటీఆర్ నాయకత్వం విఫలమైందని, ఆయన ఒక 'ఐరన్ లెగ్' అని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ క్రమంలో పార్టీ పగ్గాలను హరీష్‌రావుకు అప్పగించాలనే డిమాండ్ బీఆర్ఎస్ శ్రేణుల్లో బలంగా వినిపిస్తోందన్నారు. కేటీఆర్ తన తండ్రి కుర్చీని కోరుకుంటుంటే, హరీష్ రావు మాత్రం ఆయన రాజకీయ పతనాన్ని లేదా అంతాన్ని కోరుకుంటున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. ఘాటు విమర్శలు సంధించారు. తనదైన శైలిలో చురకలు అంటించారు. కాంగ్రెస్ పాలనను ఎండగట్టారు. తెలంగాణ తిరోగమిస్తోందంటూ మండిపడ్డారు. ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల వల్ల మళ్లీ ఫ్యూడల్ భావాలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోన్న ఫ్యూచర్ సిటీపైనా నిప్పులు చెరిగారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. దాదాపు మూడు గంటలపాటు ఈ సమావేశం కొనసాగింది. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు కేసీఆర్. దాదాపుగా ఎనిమిది నెలల తర్వాత మీడియా ముందుకు రావడం ఇదే తొలిసారి.

# బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం

- జాగృతి జనం బాట కార్యక్రమంలో కవిత పర్యటించారు
- అలంపూర్‌లో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు
- రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమె పరిశీలించారు
- మోటర్లు పనిచేయకపోడం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు
- కాలువల ఆధునీకరణ లేకపోవడం నష్టం కలిగిస్తుందని ఆరోపించారు
- సమస్యలు పరిష్కారం కాకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదివారం అలంపూర్ నియోజకవర్గంలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని సందర్శించారు. సాగునీరు అందక రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. మూడు మోటార్లకు గాను ఒక్కటే పనిచేయడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కాలువల ఆధునీకరణ లేకపోవడం వల్ల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం వినియోగంలోకి రావడం లేదని పేర్కొన్నారు. సుమారు 40 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా నీటిని ఆర్డీఎస్ కాలువలోకి పంపింగ్ చేస్తే చివరి ఆయకట్టు వరకు నీరు అందుతుందని సూచించారు. నడిగడ్డ రైతాంగానికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి ఆరు నెలల గడువు ఇస్తున్నట్లు ప్రకటించిన కవిత, ఈలోగా సమస్య పరిష్కారం కాకపోతే రైతులతో కలిసి పాదయాత్ర చేపడతామని హెచ్చరించారు. మక్క రైతుల సమస్యలపై స్పందించిన ఆమె, కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. జాగృతి ఆధ్వర్యంలో చేపట్టిన జనం బాట కార్యక్రమం పూర్తిగా రాజకీయాలకు అతీతమై కొనసాగుతోందని.. కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. జనం బాట కార్యక్రమం ఉద్దేశాలు, రాష్ట్రంలో రైతులు, బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృతంగా మాట్లాడారు. ప్రజల సమస్యల కోసం మాత్రమే జాగృతి జనం బాట కొనసాగుతోందని కవిత స్పష్టంగా చెప్పారు. ప్రతి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిపై పోరాటం చేయడమే మా లక్ష్యం. సమస్యలను తెలుసుకోవాలంటే క్షేత్రస్థాయిలోకి వెళ్లాలి. ప్రాజెక్టులను, వ్యవసాయ రంగాన్ని, ప్రజల జీవన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాల్సిందే అని అన్నారు. జనం బాట ద్వారా ప్రజల గొంతుకగా నిలవాలని జాగృతి ప్రయత్నిస్తోందని ఆమె తెలిపారు.

ప్రాజెక్టుల పరిశీలన వల్లే అసలు సమస్యలు బయటకు వస్తాయని కవిత అభిప్రాయపడ్డారు. పేపర్లలో చూపించే గణాంకాలు వేరు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలు వేరు. ప్రాజెక్టులను ప్రత్యక్షంగా పరిశీలిస్తేనే నీటి సమస్యలు, సాగు ఇబ్బందులు, రైతుల కష్టాలు అర్థమవుతాయి. అందుకే జనం బాట కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టుల పరిశీలనకు ప్రాధాన్యం ఇస్తున్నాం అని వివరించారు. పత్తి రైతుల కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. కొత్త నిబంధనల పేరుతో రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఖర్చులు పెరిగాయి, దిగుబడి ధరలు తగ్గాయి. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరం అని కవిత అన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేదని కవిత విమర్శించారు.

బీసీ రిజర్వేషన్ల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం.. బీసీలకు అన్యాయం చేస్తోందని కవిత ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లు ఖరారయ్యాకే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు వెళ్లాలి. ఇది బీసీల న్యాయమైన డిమాండ్. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని పక్కన పెట్టి ఎన్నికలకు వెళ్లాలని చూస్తోంది. ఇది బీసీలపై జరుగుతున్న అన్యాయం అని ఆమె స్పష్టం చేశారు. బీసీలకు న్యాయం జరిగే వరకు జాగృతి పోరాటం చేస్తుందని తెలిపారు. జనం బాట కార్యక్రమం పూర్తిగా రాజకీయాలకు అతీతమని కవిత మరోసారి స్పష్టం చేశారు. ఇది పార్టీ రాజకీయాల కోసం కాదు. ప్రజల సమస్యల కోసం. ఎవరి సమస్యైనా, ఏ వర్గానికి సంబంధించినదైనా జాగృతి వాటిని లేవనెత్తుతుంది. ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడమే మా బాధ్యత అని చెప్పారు. రాజకీయ నాయకులపై కూడా కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయ నాయకులు ప్రజలకంటే గొప్పవారు కాదు. ప్రజలే నాయకులను గొప్పవారిని చేస్తారు. ప్రజలకు సేవ చేయడమే రాజకీయ నాయకుల ప్రధాన కర్తవ్యం. ప్రజల సమస్యలను పట్టించుకోకపోతే ప్రజలు వారికి తగిన సమాధానం ఇస్తారు అని వ్యాఖ్యానించారు.

గతంలో కవిత నాకు కూడా టైం వస్తుంది.. నేను కూడా ఏదో ఒక రోజు సీఎం అవుతనని అన్నారు. తాను సీఎం అయితే 2014 నుంచి జరిగిన అన్ని విషయాలపై విచారణ చేయిస్తానని తెలిపారు.. తనపై ఆరోపణలు చేసిన వారికి లీగల్ నోటీసులు పంపుతనని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతల అవినీతిపై ఇంకా చిట్టా విప్పలేదు.. ఇది కేవలం టాస్ మాత్రమే అన్నారు. దీనికే ఉలిక్కి పడితే ఎలా? త్వరలోనే మీ అవినీతి, అక్రమాలపై టెస్ట్ మ్యాచ్ ఉండబోతోందన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతిని తనపై రుద్దే ప్రయత్నం చేయొద్దని.. తప్పుడు ఆరోపణలు చేస్తే ఒక్కొక్కడి తోలు తీస్తా అన్నారు. హిల్ట్ పాలసీకి కిటికీలు తెరిచింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అని.. గతంలో బీఆర్ఎస్ బాటలు వేస్తే.. ప్రస్తుతం కాంగ్రెస్ రహదారులు వేస్తోందని కవిత ఆరోపించారు. "కేటీఆర్ హయాంలో అనేక చెరువులు ప్రైవేట్ బిల్డర్లకు డెవలప్ మెంట్ కోసం ఇచ్చారు. అందులో ఉస్మాన్ కుంట చెరువును ప్రణీత్ బిల్డర్స్ కు ఇచ్చారు. ఇందులో మాధవరం కృష్ణారావు కొడుకు డైరెక్టర్ గా ఉన్నారు. మాధవరం కృష్ణారావు వెనుక ఉన్న గుంట నక్కను మాత్రం వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ఈ పదేళ్లలో నేను, నా భర్త కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా లబ్ధిపొందలేదు. మీకు దమ్ముంటే నేను మీ మీద చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వాలి. వెక్కిలి చేష్టలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదు. అవసరం అయినప్పుడు నా నగలు కుదువ పెట్టి బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించాను. తాను హరీశ్ రావుపై ఆరోపణలు చేస్తే బీజేపీ ఎందుకు మాట్లాడుతోంది." అని కవిత ప్రశ్నించారు.

## అథ్లెట్లను అభినందించిన కలెక్టర్ జతీష్ వి పాటిల్



- ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించిన పాల్వంచ ట్రైబల్ వెల్ఫేర్ కాలేజ్ విద్యార్థినులు
- ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ విభాగ విజేత అన్నం కు సన్మానం

**పాల్వంచ, విశాలభారతి:** వరంగల్‌లో ఈనెల 19 , 20 తేదీల్లో నిర్వహించిన కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ విద్యార్థినులు అసాధారణ ప్రతిభను కనబరిచారు. వివిధ విభాగాలలో పోటీపడి మొత్తం 35 పాయింట్లు సాధించి,19 పతకాలు గెలుపొందారని, ఇందులో 7 బంగారు పతకాలు 1 రజిత పతకం 11 కంస్య పతకాలు యూనివర్సిటీలో ఒవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను అందిపుచ్చుకోవడం గమనార్హం. ఈ ఘన విజయం సాధించిన విద్యార్థినులను ఆదివారం ఉదయం పాల్వంచ పట్టణంలోని నీ శ్రీనివాస కాలనీలో ఉన్న మినీ స్టేడియంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అభినందించారు. విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపి, వారి కృషి, క్రమశిక్షణ, పట్టుదల మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని కలెక్టర్ ప్రశంసించారు. అదేవిధంగా ఇటీవల 55 సంవత్సరాల పైబడిన విభాగంలో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో విన్నర్ కప్ సాధించిన అన్నం వెంకటేశ్వర్లును కలెక్టర్ ప్రత్యేకంగా శాలువాతో సత్కరించారు. ఆయన సాధించిన విజయం యువ క్రీడాకారులకు ఆదర్శమని కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ తన స్కూల్, కాలేజ్ రోజుల జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ముచ్చటించారు. క్రీడల్లో రాణించడం ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని పేర్కొంటూ, విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత రాణించేందుకు అవసరమైన సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్ కోచ్ పి. నాగేంద్రబాబుకు సన్మానం జరిగింది. జిల్లాలో ట్రాక్ అండ్ ఫీల్డ్ అభివృద్ధి కోసం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ చేస్తున్న సేవలను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో పరంధామ రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ మహీధర్, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ నరేష్, కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ, అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్రబాబు, టెన్నిస్ కోచ్ డానియల్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇరిగేషన్‌ను నాశనం చేసింది కేసీఆరే

**( మొదటిపేజీ తరువాయి )**

వల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనం జరగలేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోవడానికి కారణం.. కేసీఆరేనని ఫైర్ అయ్యారు. ప్రజల భవిష్యత్తును ఆయన తాకట్టు పెట్టారని ఆరోపించారు. కాళేశ్వరం నిర్మాణం తీరును డ్యామ్ సేఫ్టీ అథారిటీ, సుప్రీంకోర్టు జడ్జి కూడా తప్పుపట్టారని ప్రస్తావించారు. కూలిపోయిన ప్రాజెక్టులు కట్టి ఇరిగేషన్ గురించి కేసీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.



రూ.38,500 కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు ఎందుకు పెంచారని ప్రశ్నల వర్షం కురిపించారు. కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు అంచనా పెంచారని ఆరోపించారు. రూ.18 వేల కోట్లతో సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా కేసీఆర్ దేవాదుల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. రూ.లక్షల కోట్ల అప్పుతెచ్చి కూడా ప్రాజెక్టు పూర్తి చేయలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందున్న పెండింగ్ ప్రాజెక్టులు కేసీఆర్ ఎందుకు పూర్తి చేయలేదు? అని ప్రశ్నించారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులు ఎందుకు పూర్తి చేయలేదో ప్రజలు అడుగుతున్నారని.. కేసీఆర్ వెంటనే సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలోనే ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చామని తేల్చిచెప్పారు. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పచ్చి అబద్దాలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కృష్ణా జలాల కోసం గట్టిగా ట్రైబ్యునల్‌లో పోరాడుతున్నామని పేర్కొన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.7 వేల కోట్లు ఖర్చు పెట్టామని వివరించారు. ఈ ప్రాజెక్టుకు 90 టీఎంసీల కంటే తక్కువ అడగ లేదని అన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రద్దు చేసి రాష్ట్రానికి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ తప్పుల వల్లే ఇరిగేషన్ వ్యవస్థ నాశనమైందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమత్తారు.

పదేళ్ల అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసీఆర్ పాలమూరు, డిండి, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదో నల్గొండ, మహబూబ్ నగర్ ప్రజలకు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కేసీఆర్ అధికారం దిగే మూడేళ్ల ముందు నుండి ఈ ప్రాజెక్టులపై ఒక్క తట్టెడు మట్టి కూడా ఎత్తలేదని, తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పనులు మొదలుపెట్టామని వెల్లడించారు. ఇప్పటికే సుమారు 7 వేల కోట్లు పాలమూరురంగారెడ్డి కోసం ఖర్చు పెట్టామని, త్వరలోనే వీటిని పూర్తి చేస్తామని నల్గొండ బిడ్డగా మాట ఇస్తున్నానని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో కేసీఆర్ తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టారని ఉత్తమ్ ఆరోపించారు. "ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర వాళ్లు 720 టీఎంసీల నీళ్లు తీసుకెళ్తే, కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు అది 1442 టీఎంసీలకు పెరిగింది. ఇది తెలంగాణకు చేసిన ద్రోహం కాదా?" అని ప్రశ్నించారు.

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్విచ్ ఆన్ చేయడానికి సహకరించింది కేసీఆరేనని, అపెక్స్ కౌన్సిల్ సమావేశాలను వాయిదా వేసి ఏపీకి మేలు చేశారని మండిపడ్డారు. కేసీఆర్ తెచ్చిన 88 వేల కోట్ల భారీ అప్పులను తీర్చే పని ఇప్పుడు తమ ప్రభుత్వంపై పడిందని మంత్రి వివరించారు. కేసీఆర్ 11 శాతం వడ్డీకి లోన్లు తెస్తే, తమ ప్రభుత్వం వాటిని రీస్ట్రక్చర్ చేసి 7 శాతానికి తగ్గించిందని, తద్వారా రాష్ట్ర ఖజానాకు మేలు చేస్తున్నామని చెప్పారు. అబద్ధాల ప్రపంచాన్ని సృష్టించడంలో కేసీఆర్ సాటిలేరని, ఆయన నోరు జాగ్రత్తగా పెట్టుకోవాలని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలను పదేళ్లపాటు మోసం చేసిన కేసీఆర్.. ఇరిగేషన్ విషయంలో ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. తాము ఎలాంటి రాజకీయం లేకుండా, చిత్తశుద్ధితో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

# గాదె ఇన్నయ్య అరెస్ట్



- మాజీ మావోయిస్టు గాదే ఇన్నయ్యను ఎన్ఐఏ అరెస్ట్ చేసింది
- జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో అదుపులోకి తీసుకున్నారు
- తీవ్రమైన అభియోగాలు నమోదు చేస్తూ చర్యలు చేపట్టింది
- నిషేధిత సంస్థల భావజాలాన్ని ప్రచారం చేస్తున్నారనే ఆరోపణ
- వికల్ప్ అంత్యక్రియల్లో పాల్గొనడమే ప్రధాన కారణంగా తెలుస్తుంది
- వీడియో సాక్ష్యాలను ఎన్ఐఏ సేకరించినట్లు సమాచారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మాజీ మావోయిస్టు, బీఆర్ఎస్ మాజీ నేత గాదే ఇన్నయ్య అరెస్టు కలకలం రేపుతోంది. జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అనాథాశ్రమానికి పలు వాహనాల్లో వెళ్లిన ఎన్ఐఏ అధికారులు గాదె ఇన్నయ్యను అరెస్టు చేశారు. నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఇదివరకే ఆయనపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసింది. ఈ క్రమంలో గాదే ఇన్నయ్య (గాదే ఇన్నారెడ్డి)ని ఎన్ఐఏ ఆదివారం అరెస్ట్ చేసింది. ఎన్ఐఏ ఆయనపై తీవ్రమైన అభియోగాలు నమోదు చేస్తూ చర్యలు చేపట్టింది. మాజీ మావోయిస్టు నేత గాదే ఇన్నయ్యను అరెస్టు చేయడం కోసం పోలీసులు ఆయన నివాసాన్ని చుట్టుముట్టారు. నిషేధిత సంస్థల భావజాలాన్ని ప్రచారం చేయడం, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడటం ద్వారా దేశ భద్రతకు ముప్పు కలిగిస్తున్నారనే ఆరోపణలపై ఎన్ఐఏ ఆయనతో పాటు ఇతరులపై ఉపా చట్టం కింద కేసులు నమోదు చేసింది. ఈ క్రమంలో జనగామ జిల్లాలో ఎన్ఐఏ గాదె ఇన్నయ్యను అదుపులోకి తీసుకుంది. మావోయిస్ట్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రామచంద్రారెడ్డి (వికల్ప్) అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఒక సభ గాదె ఇన్నయ్య అరెస్టుకు ప్రధాన కారణమైంది. సీపీఐ (మావోయిస్ట్) అనుబంధ సంస్థ అయిన 'అమరుల బంధు మిత్రుల సంఘం' ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 'భారత్ బచావో' వ్యవస్థాపకుడిగా గాదె ఇన్నయ్య ప్రసంగించారు. తన ప్రసంగంలో భాగంగా భారత ప్రభుత్వ భద్రతా బలగాలు రామచంద్రారెడ్డిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో చిత్రహింసలు పెట్టి హత్య చేశాయని ఇన్నయ్య ఆరోపించారు. సుమారు 150 నుండి 200 మంది ప్రజలు పాల్గొన్న ఆ అంత్యక్రియల సభలో గాదె ఇన్నయ్య చేసిన ప్రసంగానికి సంబంధించి తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని ఎన్ఐఏ స్పష్టం చేసింది. ముఖ్యంగా యూట్యూబ్‌లో అప్‌లోడ్ అయిన వీడియో సాక్ష్యాలను ఎన్ఐఏ సేకరించినట్లు సమాచారం. ఈ ప్రసంగం ద్వారా గాదె ఇన్నయ్య ప్రజలను రెచ్చగొట్టి, దేశానికి వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు లేదా విధ్వంసక కార్యకలాపాలకు పురికొల్పే ప్రయత్నం చేశారని దర్యాప్తు సంస్థ పేర్కొంది. గాదే ఇన్నయ్య గతంలో మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత జనజీవన స్రవంతిలోకి వచ్చి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రస్తుతానికి ఆయన 'భారత్ బచావో' అనే సంస్థ ద్వారా సామాజిక మరియు రాజకీయ అంశాలపై గళం వినిపిస్తున్నారు. గతంలో కూడా ఆయనపై కొన్ని కేసులు నమోదయ్యాయి. అయితే తాజాగా ఎన్ఐఏ రంగంలోకి దిగి అరెస్ట్ చేయడంతో ఈ కేసు తీవ్రత పెరిగింది. అక్టోబర్ 2023లో టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) వ్యవస్థాపకుల్లో ఒకరైన గాదె ఇన్నయ్య అరెస్టుకు గురయ్యారు. రాత్రి హైదరాబాద్‌లోని నారాయణగూడ ప్రాంతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, అనాథాశ్రమ పిల్లలు ఆందోళన చెందుతున్నారు. కొద్దిరోజుల నుంచి గాదె ఇన్నయ్య 'భారత్ బచావో' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన అరెస్టు కావడం అనుమానాలకు దారి తీసింది. ఇన్నయ్యను అరెస్టు చేసింది రాష్ట్ర పోలీసులా? కేంద్ర దర్యాప్తు సంస్థలా అన్న ప్రశ్నలు తలెత్తాయి.

# విద్యార్థులు అన్ని రంగాలలో పాలుపంచుకోవాలి

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



**మొయినాబాద్, విశాలభారతి:** విద్యుత్ పాటు విద్యార్థులు అన్ని రంగాలలో పాలుపంచుకున్నప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని విజ్ఞానవంతులుగా అవుతారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా లోని ఎల్ఎన్ఆర్ కాన్సెప్ట్ పాఠశాలలో విద్యార్థులు అధ్యాపకులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని ప్రారంభించారు ఈ కార్యక్రమం పాఠశాల కరస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్యే సైన్స్ ఫెయిర్ ను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్ ప్రదర్శనను నిర్వహిస్తారని సూచించారు విద్యుత్ తో పాటు విద్యార్థులు అన్ని రంగాలలో పాల్గొన్నప్పుడే విద్యావంతులుగా విజ్ఞానవంతులుగా ఎదుగుతారని పేర్కొన్నారు ఎల్ ఎన్ ఆర్ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఎంతో అభినందనీయంగా ఉందని సూచించారు విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి విద్యార్థులను గుర్తించడం మంచి అవకాశం అని పేర్కొన్నారు విద్యాసంస్థలు విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేసినప్పుడే ఆ విద్యా సంస్థలను విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు గుర్తిస్తూ అభినందిస్తారని సూచించారు ఎల్ఎన్ఆర్ కాన్సెప్ట్ పాఠశాల మంచి పేరందుతుందని ఇలాంటి పాఠశాల అభివృద్ధిలో కరెస్పాండెంట్ రాజేంద్రప్రసాద్ కృషి అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి సునీత విద్యాధికారి సునీల్ కుమార్ స్థానిక మాది కార్పొరేటర్ సాగర్ గౌడ్ సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వవిద్యార్థుల కలుసుకోవడం అభినందనీయం

**జై బిఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ జెయింట్ సెక్రెటరీ ప్రొఫెసర్ జె .గాయత్రి.**



**మొయినాబాద్, విశాలభారతి:** పూర్వ విద్యార్థులు గత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉన్నత విద్యలో ఆనాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ కలుసుకోవడం అభినందనీయమని జెబిఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ జెయింట్ సెక్రెటరీ ప్రొఫెసర్ జై గాయత్రి అన్నారు. మండల పరిధిలోని అండాపూర్ చౌరస్తాల గల జేబిఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కళాశాలలో గతంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆనాటి విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సమ్మేళనంలో దేశ విదేశాలలో నగరంలో వివిధ ప్రాంతాల్లో ప్రతిష్టాత్మక సంస్థల్లో సేవలు అందిస్తున్న వివిధ బ్యాచ్లకు చెందిన పూర్వ విద్యార్థులు ఉద్యోగులు ఒకచోట కలుసుకొని ఉన్నత విద్య అభ్యసిస్తూ ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి జై గాయత్రి మాట్లాడుతూ జగన్ పల్లి భాస్కరరావు ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో సమ్మేళనాన్ని నిర్వహించడం విద్యార్థులను అభినందించారు ఆమె మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాత్ర ఎంతో కీలకమని అన్నారు అభ్యసించి వివిధ రంగాలలో వ్యాపారాలలో ఉద్యోగాలలో పని చేస్తూ కుటుంబ పోషణలో ఉంటూ సంతోషంగా ఉన్నందుకు ఆమె అభినందించారు అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ వృత్తిపరమైన అనుభవాలను పంచుకొంటూ ప్రస్తుత విద్యార్థులు ఆవిష్కరణ నైపుణ్య అభివృద్ధి నైతిక విలువల పై దృష్టి సారిస్తే జీవితంలో విజయాలను సాధించవచ్చునని సూచించారు ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీఎస్ అరుణ్ మూర్తి డిం శ్రీమతి ప్రత్యుష తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చి తప్పు చేశామంటున్న ప్రజలు

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోంపల్లి అనంతరెడ్డి**



**మొయినాబాద్, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీని అధికారంలోనికి తెచ్చి తప్పు చేశామని...మళ్లీ కేసీఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కోంపల్లి అనంతరెడ్డి అన్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుదారులుగా వార్డు సభ్యులుగా గెలుపొందిన ఎర్ర జైపాల్ ఉపసర్పంచ్గా ఎన్నికైనారు. బీఆర్ఎస్ వార్డు సభ్యులుగా జీనుకుంట రాజు, ముంజగల్ల శశీధర్, ముంజగల్ల వనజవిజయ్కుమార్, జీనుకుంట రోజామహేందర్లను ఆదివారం బీఆరెస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి, సీనియర్ నాయకులు మనోజ్కుమార్ ఆధ్వర్యంలో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధికార పార్టీ అభ్యర్థులకు దీటుగా గట్టి పోటీ ఇచ్చారని తెలిపారు. మండలంలో అధికార పార్టీ కంటే ఎక్కువ సర్పంచ్ స్థానాలను బీఆర్ఎస్ కైవసం చేసుకుందని తెలిపారు.ఇంకా నాలుగు స్థానాలు గెలువాల్సి ఉండగా బీఆర్ఎస్ నుంచే అభ్యర్థులు ఎక్కువ మంది పోటీ చేయడంతో ఇతర పార్టీలకు అవకాశం ఇచ్చిన వాళ్లం అయ్యామని చెప్పారు. ప్రజల్లో బీఆర్ఎస్ సానుకూలంగా ఉందని,ప్రభుత్వంపై ప్రజలు కోపంతో ఉన్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలను గెలుచుకోవడానికి అవకాశం ఉందని అన్నారు. ఓడిన వారు కూడ అధైర్య పడకుండ ధైర్యంగా ప్రజల మధ్యలో ఉంటూ మంచి రోజుల కోసం ఎదిరిచూడాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ పి జగన్మోహన్రెడ్డి, సీనియర్ నాయకులు జయవంత్, పరమేష్, సత్తిరెడ్డి, ఎర్ర సురేష్, రాంచందర్, బంటు విష్ణు, కె వెంకటేష్, నవీన్కుమార్, ఎర్ర శ్రీకాంత్, టీ మహేందర్, నర్సింహ్మా, సదాశివ, సన్నీ, తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్ బందుకు జేఏసీ పిలుపు

**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ను ప్రత్యేక జిహెచ్ఎంసి జోన్గా ఏర్పాటు చేయాలనే డిమాండ్తో మంగళవారం, తేదీ అనగా 23122025 నాడు శంషాబాద్లో స్వచ్ఛంద బంద్కు పిలుపునిస్తున్నామని శంషాబాద్ జేఏసీ తెలిపింది. ఇది రాజకీయ బంద్ కాదు. శంషాబాద్ ప్రజల భవిష్యత్తు కోసం జరిగే బంద్ అందుకే రేపు అన్ని దుకాణాలు, వ్యాపార సంస్థలు, ఆటోలు, వాహనాలు స్వచ్ఛందంగా మూసి బంద్కు మద్దతు ఇవ్వాలని, మన శంషాబాద్ భవిష్యత్తును కాపాడుకోవాలని వినమ్రంగా కోరుతున్నాము. ఈ బందులో అన్ని వర్తక-వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, చిరు వ్యాపారులు,కుల సంఘాలు, ఆటో-టాక్సీ సంఘాలు మరియు శంషాబాద్ ప్రజానీకం మొత్తం బందును విజయవంతం చేయాలని మనవి శంషాబాద్ జేఏసీ కోరడమైనది. ఈ కార్యక్రమంలో దేవరపల్లి బుచ్చిరెడ్డి, కోనమెల్ల శ్రీనివాస్, దీప మల్లేష్,సిపిఐ పార్టీ నాయకులు నర్ర గిరి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల మోహన్ రావు, రజక సంఘం నాయకులు మెట్టు అశోక్, ముదిరాజ్ సంఘం నాయకుడు సురేష్ ముదిరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు చిన్నగండు భాస్కర్, ఎమ్మెస్ యుఐ జిల్లా అధ్యక్షుడు రాచమల్ల వర్ధన్,ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.



# గాంధీ పేరు తొలగిస్తే సహించేది లేదు

**టీపీసీసీ అధ్యక్షులు మహేష్కుమార్ గౌడ్**



**మొయినాబాద్, విశాలభారతి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మి దేశాన్ని లూటీ చేస్తోందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్కుమార్ గౌడ్ ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్నగర్ గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, కార్పొరేషన్ చైర్మన్ నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్కుమార్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చారని, గాంధీ పేరును పథకం నుంచి తొలగించినంత మాత్రాన ప్రజల గుండెల్లో నుంచి గాంధీని తొలగించలేరని అన్నారు. గాంధీ పేరును ఎత్తివేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. 2005లో యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. ఈ పథకం ద్వారా కూలీలు గతంలో రోజుకు రూ.80 నుంచి నేడు సుమారు రూ.450 వరకు సంపాదిస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం పన్నెండేళ్ల పాలనలో ఒక్క కొత్త సంక్షేమ పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి దేశ సంపదను కొద్దిమంది చేతుల్లోకి అప్పగిస్తోందని, ఇది దేశాన్ని లూటీ చేయడమేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు ఆమోదించి కేంద్రానికి పంపినా బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందడమే బీజేపీ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి వంశీచందర్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ కుమార్, టీపీసీసీ సభ్యులు షాబాద్ దర్శన్, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఈర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మోస్ట్ బాక్వర్డ్ క్లాస్ కార్పోరేషన్ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి, ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వరముదిరాజ్, నేతలు బొంతు రామోహ్మాన్, పామెన భీంభరత్, చింపుల సత్యనారాయణరెడ్డి, షాబాద్ దర్శన్, జితేందర్, పారిజాత, మండల అధ్యక్షుడు మాణెయ్య, నాయకులు ప్రతాప్రెడ్డి, జైపల్రెడ్డి, వెంకట్రెడ్డి, రాంరెడ్డి, కేబుల్ రాజు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



# పడిలేచిన కెరటం

- **'వెన్నుపోటు'తో రెండు సార్లు ఓటమి**
- **అయినా చెక్కు చెదరని గుండె ధైర్యం**
- **మూడోసారి పోటీ చేసి ఘన విజయం**
- **నేడు సర్పంచ్ గా ప్రమాణ స్వీకారం**



**పాలకుర్తి, విశాలభారతి:**

25 ఏండ్ల రాజకీయ పోరాటం ఆయనది. ఊరికి ఏదైన మంచి చేయాలన్న ఆరాటం తనది. 'వెన్నుపోటు'వల్ల గత రెండు సార్లు ఓటమి చవిచూసినా చెక్కు చెదరని గుండె ధైర్యం ఆయనది. ఆ ధైర్యంతోనే తాజాగా మూడోసారి సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచి ఘన విజయం సొంతం చేసుకున్నాడు జనగామ జిల్లా, పాలకుర్తి మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన పోశాల వెంకన్న. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు.. తన ఈ విజయంతో అటు రాజకీయ ప్రత్యర్థులకు.. ఇటు తన ఓటముల పరంపరకు చెక్ పెట్టాడు.

**చిన్నప్పటి నుంచే రాజకీయాలపై ఆసక్తి..**

పోశాల వెంకన్న చిన్నప్పటి నుంచే రాజకీయాల పై ఆసక్తి పెంచుకున్నాడు. ఎస్ఎఫ్ఐ, సీపీఎం పార్టీ కార్యకర్తగా మొదలైన ఆయన రాజకీయ ప్రస్థానం.. బీఆర్ఎస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా కొనసాగుతోంది. 2014లో బీఆర్ఎస్ నుంచి సర్పంచ్ గా పోటీ చేసిన వెంకన్న..సొంత పార్టీలోనే కొందరి ద్రోహుల వల్ల ఓడిపోయాడు. 2018లో సర్పంచ్ స్థానం బీసీ మహిళకు రిజర్వు కావడంతో తన భార్య రమ ను బీఆర్ఎస్ నుంచి ఎన్నికల బరిలోకి దింపాడు. అయితే మళ్ళీ అదే వెన్నుపోటుదారుల మోసం వల్ల స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిని చవిచూశాడు. ఇలా వరుసగా రెండుసార్లు ఓడిపోవడంతో ఆర్థికంగా, మానసికంగా తీవ్ర వేదనను అనుభవించాడు. కానీ ఓ ప్రజా ప్రతినిధిగా ఊరికి సేవ చేయాలన్న కోరిక మాత్రం తనలో అలానే ఉండిపోయింది. పదవి లేకున్నా తన వల్ల అయిన మేరకు ప్రజలకు సాయం చేశాడు. ఇక తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ గా గెలిచి తన చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకున్నాడు. ఈ క్రమంలోనే నేడు ప్రమాణ స్వీకారం చేసి గ్రామ అభివృద్ధి కోసం అడుగులు వేయనున్నాడు.

**గ్రామాభివృద్ధియే నా ఆశయం..**

ఎన్నో ఏళ్లుగా గ్రామం అభివృద్ధికి దూరంగా ఉంది. ఇప్పటికీ గ్రామ పంచాయతీకి సొంత భవనం లేదు. చాలా కాలనీల్లో సరైన మౌలిక వసతులు లేవు. సరిపోయినన్ని స్ట్రీట్ లైట్లు కూడా లేవు. పాఠశాలల్లో కూడా అనేక సమస్యలు ఉన్నాయి. ఇలా ఇంకా ఎన్నో సమస్యలు గ్రామంలో ఉన్నాయి. వాటన్నింటినీ ప్రజలు, అధికారుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తాను.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



**పార్టీలో స్వచ్ఛందంగా చేసిన 200కుటుంబాలు**

**చర్ల, విశాలభారతి:** మొదటిసారి మండలానికి విచ్చేసిన జిల్లా పార్టీ అధ్యక్షురాలుకు ఘన స్వాగతం పలికిన చర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు. సత్యనారాయణపురం గ్రామంలోని మిల్ రోడ్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా సుమారు 200 కుటుంబాలకు చెందిన గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గౌరవ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శ్రీ పొదెం వీరయ్య , మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ,శ్రీమతి తోట దేవి ప్రసన్న నూతనంగా చేరిన వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజాహిత కార్యక్రమాలపై ఉన్న అభిమానంతో, అలాగే శ్రీ పొదెం వీరయ్య నాయకత్వంపై ఉన్న విశ్వాసం,నమ్మకంతో గ్రామస్తులంతా స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన గ్రామస్తులంతా కాంగ్రెస్ కుటుంబంలో భాగమయ్యామని సంతోషం వ్యక్తం చేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

**గొప్ప మనసు చాటుకున్న మేకల బాలకృష్ణారెడ్డి**





**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి బిజెపి యువ నాయకులు మేకల బాలకృష్ణారెడ్డి తన గొప్ప మనసును చాటుకున్నారు. యాచారం మండలం,మొండి గౌరెల్లి గ్రామానికి చెందిన తాండ్ర శివకుమార్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బిజెపి యువ నాయకులు మేకల బాలకృష్ణారెడ్డి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ తాండ్ర శివకుమార్ కుటుంబానికి సహాయం చేయడం తన సామాజిక బాధ్యతలో భాగమని,ఇలాంటి సహాయ కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొండి గౌరెల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ పోస్టర్ ఆవిష్కరణ

**కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** హయత్నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆదివారం లక్ష్మారెడ్డి పాలెం సమీపంలోని హయత్నగర్ బంజారా కాలనీలో ఏర్పాటు చేసిన డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ పోస్టర్ను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేశ రక్షణ రంగంలో సేవ చేయాలనే తపనతో ముందుకు వస్తున్న యువత అభినందనీయమని అన్నారు. రక్షణ రంగంలో కెరీర్ను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులకు డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ సరైన మార్గదర్శకత్వం అందిస్తుందని పేర్కొన్నారు. నైపుణ్యాలు, క్రమశిక్షణ, దేశభక్తిని ప్రతి అభ్యర్థిలో పెంపొందించడంలో ఇలాంటి అకాడమీల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. యువత తమ లక్ష్యాలను సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజానికి ఉపయోగపడే ఇలాంటి మంచి కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కార్పొరేటర్ భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, బంజారా కాలనీ బీజేపీ నాయకులు బాలు నాయక్, మధుసూదన్, భరత్ తదితర నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి నివారణకు వార్డు సభ్యురాలి చొరవ

**నూతన బోర్ వేసి సమస్యను పరిష్కరించిన పసుల స్వప్న**



**కేశంపేట, విశాలభారతి:** మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని 4వ వార్డులో గత కొంత కాలంగా ప్రజలు తీవ్ర నీటి ఎద్దడితో బాధపడుతున్నారు.గ్రామపంచాయతీ ఎన్నికలలో వార్డు బరిలో నిలిచిన పసుల స్వప్న తనను గెలిపిస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తానని మాట ఇచ్చింది.ఇచ్చిన హామీ ప్రకారం గెలిచిన వెంటనే తన ప్రమాణ స్వీకారానికి ముందే ఆదివారం నూతన బోర్ వేపించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. దీంతో ఆమెకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు నవీన్ కుమార్, మల్లేష్ యాదవ్, జమాల్ ఖాన్, నరేష్ యాదవ్, ఉపసర్పంచ్ కర్నాటి దర్శన్, నాయకులు కుంటి లక్ష్మయ్య,జగన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, బండారి దశరథ, గొడుగు కృష్ణయ్య, గణేష్ గౌడ్, వార్డు సభ్యులు అల్లే ప్రవళిక సంతోష్, చుక్క శ్రీను, కాకునూర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యధావిధిగా నేడు ప్రజావాణి కార్యక్రమం

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని నేటి (సోమవారం) నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# జాతీయ ఉపాధి హామీ పథకంపై బీజేపీ కుట్ర

**అజీజ్నగర్లలో కాంగ్రెస్ ఆందోళన**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** జాతీయ ఉపాధి హామీ చట్టం పథకంలో మహాత్మా గాంధీ పేరును తొలగించి, "వికసిత్ భారత్ జి.రామ్.జి" పేరిట కొత్త పథకాన్ని ప్రవేశపెట్టాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను నిరసిస్తూ, ఆదివారం రోజు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల, మొయినాబాద్, అజీజ్నగర్ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివశరణ్ రెడ్డి పాల్గొన్నారు .ఈ సందర్భంగా శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ పేదల జీవనాధారంగా ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై యువత పోరాటానికి సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే వంశీ చందర్ రెడ్డి, రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్,యువజన కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు.



# జోనల్ కమిషనర్ గారు.. అక్రమ నిర్మాణం వైపు చూడరా?

- హయత్నగర్ సర్కిల్ అంత అవినీతి మయం
- గాఢ నిద్ర లో ఏసీబీ, విజిలెన్స్ అధికారులు
- స్టిల్ప్ టు అనుమతులతో నాలుగు అంతస్తుల భవనం
- పేరు రెసిడెన్షియల్.. నిర్మాణం కమర్షియల్
- సీజింగ్ నోటీసులతో కాలయాపన చేస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసిపి
- లక్షలు రూపాయలు లంచం ఇచ్చాం.. అందుకే అక్రమ నిర్మాణం చేపడుతాం
- జోనల్ కమిషనర్ అడ్మినిస్ట్రేషన్లో అక్రమ నిర్మాణాలు ఇంకెన్నో




**ఎల్బీనగర్, విశాలభారతి:**

హయత్ నగర్ సర్కిల్03 విజయవాడ హైవేకు అనుకుని పనామ చౌరస్తా వద్ద బహుళ అంతస్తుల భవనం అక్రమ నిర్మాణం జరుగుతుందని తెలిసింది. ఆప్రాంతంలో స్థలం ఎక్కువ ఉంటే పర్మిషన్ తీసుకుని స్టీల్ ప్లస్ 5 అంతస్థులు వేసుకోవచ్చు. కానీ నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా స్టిల్ ప్లస్ టు పర్మిషన్తో నాలుగు అంతస్తుల వాణిజ్య భవనం నిర్మించారని సమాచారం. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణదారులు భవనం మొదలు బహుళ అంతస్తుల నిర్మాణం వరకు ఎన్నివిధాలుగా జీహెచ్ఎంసీని మోసగించవచ్చో అన్ని విధాలుగా మోసం చేశారనీ, ఈ నిర్మాణం మొదటి నుంచి అక్రమ పద్ధతి లోనే కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడు నెలల క్రితం సదరు నిర్మాణంపై ఫిర్యాదులు అందడంతో జీ హెచ్ఎంసి అధికారులు, కానీ జీహెచ్ఎంసి ఆదేశాలను నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారని,ఆ తర్వాత ఆ భవనానికి నోటీసు ఇచ్చారు. నోటీసులు ఇచ్చి నెల రోజులు కావస్తున్నా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని తెలిసింది. యథేచ్ఛగా స్టిల్ ప్లస్ టు పర్మిషన్ తో నాలుగు అంతస్తుల అక్రమ నిర్మాణం సాగిస్తుంటే అధికారులెందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారో తెలి యాల్సి ఉంది. ఇంత తతంగం జిహెచ్ఎంసి ఎల్బీనగర్ జోనల్ పరిధిలో జరుగుతున్న లక్షల రూపాయలు లంచం రూపంలో చేతులు మారుతున్న ఏసీబీ అధికారులు అవినీతి అధికారులపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

**సీజింగ్ నోటీస్ ఇచ్చి సీజ్ చేస్తాం: హయత్ నగర్ సర్కిల్-03 టౌన్ప్లానింగ్ ఏసీపీ విజయలక్ష్మి..**

జి ప్లస్ టు అనుమతులు తీసుకొని అదనంగా రెండు వాణిజ్య అంతస్తుల నిర్మాణాలు చేపట్టిన భవనంపై కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో ఇక్కడ పని చేసిన అధికారులు పర్మిషన్ ఇచ్చారు సీజింగ్ ఆర్డర్ నోటీసులు ఇచ్చి భవనాన్ని సీజ్ చేస్తామన్నారు.

## ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆహ్వానం

- నేడు సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం
- ముస్తాబైన గ్రామ పంచాయతీ కార్యాలయం



**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** ఈనెల 17న మూడో విడత సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన సర్పంచ్ , వార్డు సభ్యులు నేడు చేపట్టే ప్రమాణ స్వీకార మహోత్సవానికి రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముస్తాబు చేశారు. నేడు నూతన సర్పంచ్ గా ప్రమాణస్వీకారం చేయనున్న రాయికంటి విజయ్ కుమార్ తోపాటు 12 మంది వార్డు సభ్యులు చేపట్టే ప్రమాణ స్వీకార మహోత్సవానికి గ్రామంలోని ప్రజలందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజయ్ కుమార్ కోరారు. నందివనపర్తి గ్రామ అభివృద్ధి ప్రయాణంలో తొలి అడుగు వేస్తూ, మీ బిడ్డగా, మీ సేవకుడిగా తను సర్పంచ్ బాధ్యతలు చేపట్టబోతున్నానన్నారు. గ్రామస్థులు విచ్చేసి, తనను ఆశీర్వదించి, గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

## హైడ్రా కమిషనర్ గన్‌మెన్ కృష్ణ చైతన్య ఆత్మహత్యాయత్నం

- కామినేని ఆసుపత్రిలో చికిత్స – పరిస్థితి విషమం




**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైడ్రా కమిషనర్ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణ చైతన్య ఆదివారం ఉదయం హయత్‌నగర్‌లోని తన నివాసంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సర్వీస్ గన్‌తో కాల్చుకొని తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులు వెంటనే కామినేని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కృష్ణ చైతన్యకు కామినేని ఆసుపత్రిలో వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సమస్యల కారణంగానే అతడు ఈ అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఘటనకు గల కచ్చితమైన కారణాలపై ఇంకా దర్యాప్తు కొనసాగుతోంది. సమాచారం అందుకున్న హైడ్రా కమిషనర్ స్వయంగా కామినేని ఆసుపత్రికి చేరుకుని వైద్యుల నుండి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. కృష్ణ చైతన్యకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అలాగే చికిత్సకు హైడ్రా తరఫున పూర్తి సహకారం అందిస్తామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడిన హైడ్రా కమిషనర్ వారికి ధైర్యం చెప్పి, ఎలాంటి ఆందోళన అవసరం లేదని తెలిపారు. కృష్ణ చైతన్య తన భార్యతో కలిసి హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. ఘటనపై సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం

**కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆంధ్రాకేసరి నగర్‌లో పార్క్ అభివృద్ధి పనులను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆదివారం కాలనీవాసులతో కలిసి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు పార్క్‌లు ఆరోగ్యకర జీవనానికి అవసరమైన ప్రధాన వేదికలని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం హరిత వాతావరణంలో ప్రశాంతంగా జీవించేలా పార్క్‌ల అభివృద్ధి ఎంతో కీలకమని అన్నారు. ఆంధ్రాకేసరి నగర్ పార్క్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి, పిల్లలు, మహిళలు, వృద్ధులు అందరూ సురక్షితంగా వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ తెలిపారు. అలాగే కాలనీవాసులు సూచించిన ఇతర సమస్యలను కూడా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రవిశంకర్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సత్యమూర్తి, శ్రీనివాసులు, నర్సింహా, నీలకంఠేశ్వరరావు, కృష్ణతో పాటు బీజేపీ నాయకులు, కాలనీవాసులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## దళిత బహుజనులు బానిసత్వం వదలాలి

- బోడుప్పల్లో 357వ వారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు జ్ఞానమాల
- అంబేద్కర్ స్ఫూర్తితో ఉన్నత స్థానానికి ఎదగాలి
- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నత్తి మైసయ్య



**మేడిపల్లి, విశాలభారతి:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 357వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ దళిత, బహుజనులు స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు గడచిన అనుకున్న స్థాయిలో అభివృద్ధి చెందకపోవడం విచారకరమని, దీనికి ప్రధాన కారణం కొన్ని ఉన్నత వర్గాల గుప్పెట్లో బానిసలుగానే ఉండడం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో బానిసత్వాన్ని విడనాడి,ఉన్నత విద్యను అభ్యసించి, అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని, విద్యా, ఉద్యోగ, రాజకీయ వ్యాపార రంగాలలో దళిత, బహుజనులు రాణించినప్పుడే బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశలు, ఆశయాలు, ఆకాంక్షల నెరవేరుతాయని, ఆ దిశగా భారత దేశంలోని దళిత, బహుజన, పీడిత వర్గాలు రాజ్యాంగబద్ధమైన హక్కులను వినియోగించుకుని ఉన్నత విద్య ద్వారా విజ్ఞానాన్ని పొంది తమ బానిస సంకెళ్లను విడిపించుకోవాలని నత్తి మైసయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, గరుగుల యాకయ్య, గుంటి శ్రీనివాస్, చిల్ల అంజయ్య, బెక్కం శివ, కంచి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచులకు సన్మానం



**కేశంపేట, విశాలభారతి:** కేశంపేటగ్రామపంచాయతీలకు ఇటీవల జరిగిన ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన తొమ్మిది రేకుల, నిర్దవెల్లి ఉమ్మడి గ్రామాల సర్పంచులు బీస కవితాకరుణాకర్ రెడ్డి,చెదురువెల్లి భాస్కర్ గౌడ్ లను తొమ్మిది రేకుల గ్రామ రెడ్డి యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీసరత్నాకర్ రెడ్డి, ఎనుముల భూపాల్ రెడ్డి, నరేష్ రెడ్డి , శ్రీకాంత్ రెడ్డి, సుజీవరెడ్డి, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే క్రీడలకు అధిక ప్రాధాన్యత

**కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్‌కుమార్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** తెలంగాణలో క్రీడలు, క్రీడాకారుల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని కంటెస్టెడ్ ఎమ్మెల్యే, సికింద్రాబాద్ కాంగ్రెస్ ఇంఛార్జీ ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. చిలకలగూడ జీహెచ్ఎంసీ పార్కులో షటిల్ బాడ్మింటన్ కోర్టులను ఆయన ఆదివారం అధికారికంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆదం సంతోష్‌కుమార్ మాట్లాడుతు ప్రపంచ ప్రఖ్యాత ఫుట్ బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని నగరానికి తీసుకువచ్చిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి క్రీడావసతులు, సౌకర్యాలను కల్పించేందుకు,వర్ధమాన క్రీడకారులను మరింతగా పోత్సహించేందుకు, కాంక్రిట్ జంగిల్‌గా మారిన నగరంలో క్రీడమైదానాల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని హామి ఇచ్చారు. 70 ఏళ్ల వయోవృద్ధులు మొదలుకొని చిన్నారులు, యువత, విద్యార్థులు, మహిళలు గత కొన్నేళ్లుగా చిలకలగూడ పార్కులో షటిల్ బాడ్మింటన్ ఆడుతుండగా, కొంతమంది ఓర్వలేనితనంతో అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేయడం తగదన్నారు. క్రీడల అభివృద్ధికి సంబంధిత అధికారులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కొంతమంది వ్యక్తులు గత ఏడాది కాలంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విన్నవించుకున్న వెంటనే స్పందించి, అధికారులతో చర్చించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, రెండు షటిల్ బాడ్మింటన్ కోర్టులను అందుబాటులోకి తెచ్చిన ఆదం సంతోష్ కుమార్‌కు స్థానిక ప్రజలతోపాటు చిలకలగూడ పార్కు వెల్ఫేల్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ, సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు క్రీడకారులు ఆదం సంతోష్‌కుమార్‌కు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు బాలరాజు, అనీల్‌బెన్‌హర్, రఘునందన్, రాజీవ్, ఉమాకాంత్, చంద్రశేఖర్, ఎస్ఎన్ రెడ్డి, కిరణ్, శ్రీకాంత్, రాంబాబు, మున్నాబాయ్, రమాదేవి, మేరీ, నస్రీన్, సౌజన్య, ఉషాలతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, క్రీడకారులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ఆశలపల్లకిలో ఆసీనులవనున్న కొత్త సర్పంచులు

- కొత్త సర్పంచులకు కొంగొత్త సమస్యలు
- నేడే సర్పంచుల ప్రమాణ స్వీకారం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి :** ఆశల పల్లకిలో కొత్త సర్పంచులు ఆసీనులు కానున్నారు. గ్రామాలలో ప్రజాసేవ చేయాలన్న లక్ష్యంతో సర్పంచులు గా పోటీలు చేసిన వారు సర్వశక్తులు వడ్డించి గెలుపొందిన నూతన సర్పంచులు నేడు బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు పంచాయతీ అధికారులు నూతన సర్పంచుల ప్రమాణస్వీకార ఉత్సవాలకు అన్నిరకాల ఏర్పాట్లను పూర్తి చేశారు. సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో ఎంపీడీవో, ఎం పి ఓ లతో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు నూతన పాలకవర్గాల చేత ప్రమాణ స్వీకారాలు చేయించనున్నారు. నేటి నుండి అధికారికంగా సర్పంచులుగా అధికారాలు చేపట్టనున్నారు.

**నూతన సర్పంచులకు స్వాగతం పలకనున్న కొంగొత్త సమస్యలు...**

గ్రామపంచాయతీలలో ప్రజలకు సేవ చేయాలన్న కుతూహలంతో సర్పంచ్ పదవులు చేపట్టిన కొత్త సర్పంచులకు కొంగొత్త సమస్యలు స్వాగతం పలకలు ఉన్నాయి. ఎన్నికల్లో గెలిచేందుకు ఆయా పంచాయతీలలో ప్రచారాలు నిర్వహిస్తున్న సందర్భంలో గ్రామపంచాయతీలలోని ప్రజలకు అభ్యర్థులతో పాటు వారి మద్దతుదారులు అనేక హామీలను కో కొల్లలుగా ఇచ్చారు. ఇక బాధ్యతలు చేపట్టి కుర్చీలో ఆసీనులైన దగ్గర నుండి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత నూతన సర్పంచుల పై ఉంది. గత పాలకవర్గాలు పరిపాలన ముగిసి సుమారు రెండేళ్ల కాలం కావస్తుంది. ఈ రెండేళ్ల కాలంలో గ్రామపంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించి పరిపాలన కొనసాగించారు. ఈ ప్రత్యేక అధికారుల పాలనలో ప్రభుత్వం నుండి పంచాయితీల అభివృద్ధికి కావలసినన్ని నిధులు రాకపోవడంతో ప్రత్యేక అధికారులు అత్యవసరాలకు సంబంధించిన పనులనే చేపట్టారు తప్ప ఆర్థిక భారంతో కూడుకున్న పనులేవి ముట్టుకోలేదు. అంతేకాకుండా సర్పంచుల పదవీకాలం ముగిసి సర్పంచులు లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుండి గ్రామపంచాయతీలకు రావలసిన నిధులు కూడా గత రెండేళ్ల కాలం నుండి విడుదల కాలేదు. దీనివలన కొన్ని గ్రామపంచాయతీలో లెక్కలేనన్ని సమస్యలు తిష్ట వేసుకొని కూర్చుని ఉన్నాయి. వీటన్నింటిని పరిష్కరించడం ఇప్పుడు కుర్చీని అవరోధించే పాలకవర్గాలకు తప్పేట్లు లేదు. ముఖ్యంగా గెలుపు కోసం అనేక హామీలను ఇచ్చిన సర్పంచ్లకు ఈ గ్రామపంచాయతీలలోని సమస్యలు పరిష్కరించడం సవాలుగా మారెట్లు ఉన్నాయి. ఇక కొత్త ఏడాదిలో కొత్త సర్పంచులు వారి పరిపాలన ప్రజలకు ఇచ్చిన హామీలను ఎంత మేరకు నెరవేర్చుతారో ఎదురుచూడాల్సిందే.


## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్**



**మేడిపల్లి, విశాలభారతి:** బోమ్మక్ శంకరయ్య కన్వేన్షన్ హల్ నూతన సంవత్సరం 2026 క్యాలెండర్ ను ఆదివారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయన నివాసంలో బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ కార్పొరేటర్ పోగుల నర్సింహ్మారెడ్డి,మాజీ బ్యాంక్ డైరెక్టర్ బోమ్మక్ విశ్వనాథ్,మాజీ కార్పొరేటర్ బోమ్మక్ కళ్యాణ్ కుమార్, బోమ్మక్ నర్సింగ్ రావు తనయుడు బోమ్మక్ చరణ్,మేనేజర్ బుంగ కుమార్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ బోడుప్పల్ లో మాజీ వార్డు సభ్యులు, టీడీపీ పార్టీ అధ్యక్షులుగా బోమ్మక్ నర్సింగ్ రావు గారు ఎన్నో సామాజిక కార్యక్రమాలు, అభివృద్ధి లో పాలుపంచుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మరాటి మల్లేష్ ,పడతం లోకేష్ ,జానీ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వకర్మ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**సికింద్రాబాద్, విశాలభారతి:** బౌద్ధ నగర్ డివిజన్లో విశ్వబ్రహ్మ సంఘం ఆధ్వర్యంలో 2026 క్యాలెండర్ను కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు జామ అనిల్ కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బబ్లు రాజేందర్‌లతో పాటు విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా మెరీడియన్ స్కూల్ వార్షికోత్సవాలు

**ముఖ్యఅతిథిగా మంత్రి శ్రీధర్ బాబు**

**మేడిపల్లి, విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మెరిడియన్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వేడుకల్లో వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ , మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి , బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నైతిక విలువలతో భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




## నిర్ధవెల్లిలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు




**కేశంపేట, విశాలభారతి:** కేశంపేట మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామంలో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెదురువెల్లి భాస్కర్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఘనంగా చేసుకునే పండుగ క్రిస్మస్ అని తెలిపారు. ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని చేసుకునే అతి పెద్ద పండుగ అని, ప్రపంచమంతా చేసుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పల్లాటి కృష్ణయ్య, అవ్వారి ఉమాపతి, సురేందర్,ఆమెర్,తోట వెంకటేష్, సిల్వేరు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

**దేవరుప్పుల, విశాలభారతి :** ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యదర్శి శ్రీ బుర్ర రమేష్ గారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలిసి ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యవర్గంలో దేవరుప్పుల మండలంలోని కోల్కొండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ గైని శంకరయ్య జిల్లా జనరల్ సెక్రెటరీగా, అదేవిధంగా మాదాపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి నల్ల లలిత గారు జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలుగా ఎన్నిక కావడం జరిగింది. ఈ సమావేశంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది.ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిలో పోస్టులు కేటాయించడం వల్ల తరగతికి ఒక ఉపాధ్యాయుడు లేక బోధనకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని దీనివల్ల విద్యార్థులు ఎంతో నష్టపోవాల్సి వస్తుందని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు కాకుండా ప్రాథమిక పాఠశాలల పట్ల అవగాహన కలిగిన ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేష్ గారితో పాటు మండలం లోని అన్ని మండలాల అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు,కార్యవర్గ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## కొలువుదీరనున్న సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు ఇటీవల ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు నేడు అధికారికంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, నూతన సర్పంచ్‌లు తమ బాధ్యతలను స్వీకరించనున్నారు. గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు దిశగా నూతన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు పని చేయనున్నట్లు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శక పాలన అందించడమే తమ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ప్రమాణ స్వీకరణ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు ,పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది.



**DISTRICT news**
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# సజ్జ రవి హత్య కేసులో పోలీసులకు పట్టుబడ్డ నిందితులు

- పట్టుబడ్డ నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు
- మిగతా వారికోసం గాలింపు చర్యలు ముమ్మరం
- వివరాలు వివరాలను వెల్లడించిన ఏ ఎస్పీ భద్రాచలం




**భద్రాచలం: విశాలభారతి:**

ఈ నెల 17.12.2025 న సాయంత్రం సమయంలో భద్రాచలం,చర్ల రోడ్ లోని తిరుమల వైన్స్ షాప్ దగ్గరలో జరిగిన సజ్జ రవి హత్య కేసు కు సంబంధించిన నిందితులను భద్రాచలం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. ప్రధాన నిందితులైన పంగి శివ, బోయిన దుర్గా ప్రసాద్, జలకం నాగరాజు లతో పాటు మరొక 6గురుని అరెస్ట్ చేశామనితెలిపారు. ఇట్టి వారిని కోర్ట్ లో హాజరు పర్చడం జరుగుతుందని అన్నారు.మిగిలిన ముద్దాయి కోసం పోలీస్ బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తూన్నాయి.వెల్లడించారు.

**పట్టుబడినవారి వివరములు..**

1) పంగి శివ S/o (లేట్) విజయ్, వయస్సు: 24 సం, కులం: కోయ, వృత్తి: కూలి మరియు ఆటో డ్రైవర్, నివాసం: రాజుపేట కాలని, భద్రాచలం, కొత్తగూడెం జిల్లా. 2) బోయిన దుర్గా ప్రసాద్, తండ్రి పేరు: చందు, వయస్సు: 24 సం, కులం: కోయ, వృత్తి: రాడ్ బెండింగ్ వర్క్, నివాసం: రాజుపేట కాలని, భద్రాచలం, కొత్తగూడెం జిల్లా. 3) జలకం నాగరాజు, తండ్రి పేరు: రాధ కృష్ణ, వయస్సు: 24 సం, కులం: కోయ, వృత్తి: కార్ డ్రైవర్, నివాసం: ASR కాలనీ భద్రాచలం, కొత్తగూడెం జిల్లా. 4) బొడ్డు అఖిల్@ అఖిల్ రాజ్, తండ్రి పేరు: వీరయ్య (లేట్), వయస్సు: 21 సం, కులం: గౌడ, వృత్తి: కూలి, నివాసం: ASR కాలనీ, భద్రాచలం, కొత్తగూడెం జిల్లా. 5) లంకపల్లి వెంకటేష్, తండ్రి పేరు: శ్రీను, వయస్సు: 24 సం, కులం: యాదవ్, వృత్తి: తాపిపని, నివాసం: ASR కాలనీ, భద్రాచలం, కొత్తగూడెం జిల్లా. 6) ముత్యాల జయరాం, తండ్రి పేరు: నాగేశ్వర్ రావు, వయస్సు: 23 సం, కులం: మున్నూరు కాపు, వృత్తి: స్టూడెంట్, నివాసం: టెంపుల్ రోడ్, భద్రాచలం, కొత్తగూడెం జిల్లా. 7) రిక్క వీర శివ శంకర్ రెడ్డి @ రిక్క శివ @ గుండు శివ, తండ్రి పేరు: భద్ర రెడ్డి, వయస్సు: 25 సం, కులం: రెడ్డి, వృత్తి: తాపి పని, నివాసం: రాజుపేట కాలని భద్రాచలం, కొత్తగూడెం జిల్లా. 8) కాపుల శివ @ శివ ప్రసాద్, తండ్రి పేరు: గోపి, వయస్సు: 35 సం, కులం: మల, వృత్తి: రాడ్ బెండింగ్ వర్క్, నివాసం: MP కాలని భద్రాచలం, కొత్తగూడెం జిల్లా 9) కాపుల కృష్ణ, తండ్రి పేరు: శ్రీనివాస రావు, వయస్సు: 24 సం, కులం: మాల, వృత్తి: రాడ్ బెండింగ్ వర్క్, నివాసం: ఎంపీ కాలని భద్రాచలం, కొత్తగూడెం జిల్లా

## సిపిఎస్ ని రద్దు చేసే వరకు పోరాటం

**టిఎస్ సిపిఎస్ ఈ యు రాష్ట్ర అధ్యక్షులు గంగాపురం స్థిత ప్రజ్ఞ**




**పాల్వంచ, విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము)ను రద్దు చేస్తామని మాట ఇచ్చి మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్( కొత్త పెన్షన్ విధానాన్ని)ను వెంటనే రద్దు చేయాలని లేకపోతే సిపిఎస్ రద్దయ్యే వరకు పోరాటం చేస్తామని దీని కొరకు వెంటనే కార్య చర్ల ప్రకటిస్తామని టీఎస్ సీపీఎస్ఈయు రాష్ట్ర అధ్యక్షులు ఎన్ ఎం ఓ పి ఎస్ జాతీయ కార్యదర్శి స్థిత ప్రజ్ఞ డిమాండ్ చేశారు. డు టీఎస్ సిపిఎస్ ఈ యు భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు స్థిత ప్రజ్ఞ కల్వల శ్రీకాంత్ లు హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగా తెలంగాణలో 2.5 లక్షల మంది ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కొత్త పెన్షన్ విధానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

**ఉద్యోగుల ఏరియర్స్ నీ ప్రతినెల వెంటనే చెల్లించాలని డిమాండ్**

ప్రభుత్వం ప్రతినెల ఉద్యోగుల బకాయిల కొరకు 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నప్పటికీ సిపిఎస్ ఉద్యోగుల డి ఏ ఏరియర్స్ ని ఒక రూపాయి కూడా చెల్లించలేదని, 60 శాతం మంది ఉన్న సిపిఎస్ ఉద్యోగుల ఏరియర్స్ నీ ప్రతినెల వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు

**సభ్యత్వంతో పాటు మూడు లక్షల ప్రమాద బీమా**

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్ మాట్లాడుతూ టి ఎస్ సి పి ఎస్ ఈ యు సభ్యత్వంతో మూడు లక్షల ప్రమాద భీమా ను అందిస్తున్నట్లు, సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు అందరూ టీఎస్ సీపీఎస్ఈయు సభ్యత్వాన్ని తీసుకోవాలని పిలుపునిచ్చారు.

**భద్రాద్రి జిల్లా కార్యవర్గ విస్తరణ**

ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా నుండి రాష్ట్ర కార్యదర్శిగా నాగునాయక్ ని నియమించారు. భద్రాద్రి జిల్లా కార్యవర్గ విస్తరణ లో భాగంగా నూతనంగా రామకృష్ణ, ప్రభాకర్ రమణ, శ్రీనివాస్, నారాయణ, దేవేందర్ బాలరాజు ,పూనం రమేష్ జోగారావు, బిక్షం గోపి రవీంద్ర, శ్రీనివాసరావు లతో పాటు జేవీల్ జ్యుడిషేరి డిపార్ట్మెంట్ ప్రతినిధులను జిల్లా కమిటీ సభ్యులుగా నియమించడం జరిగింది. మహిళా కమిటీ మెంబర్స్ గా మంజుశ్రీ, కవిత, ప్రశాంతి లను నియమించారు. ఈ కార్యక్రమంలో టి ఎస్ సి పి ఎస్ ఈ యు భద్రాద్రి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుక్కాని శ్రీనివాస రెడ్డి రాజశేఖర్ ల తోపాటు జిల్లా రాష్ట్ర ఐటీ సెల్ కార్యదర్శి గోరంట్ల సురేష్ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్ బట్టు శ్రీను రఘురామ బండి వెంకటేశ్వర్లు మజార్ అహ్మద్ మరియు వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## మరం భీం విద్యార్థి నిలయంకు వితరణ




**చర్ల, విశాలభారతి:** వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంకు రైస్ పేట గ్రామానికి చెందిన పోలిన నవీన్ నందిని దంపతులు వితరణ అందచేసారు. వీరి కుమార్తె లాశ్రిత జన్మదినం సందర్భంగా 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, పండ్లు, స్వీట్స్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడారు విద్యార్థులు పట్టుదలతో విద్యనభ్యసించి ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తద్వారా తల్లిదండ్రులతో పాటు వనవాసీ సంస్దకు పేరు ప్రతిష్టతను తీసుకురావాలని అన్నారు. వనవాసీ నిలయకమిటీ ఉపాద్యక్షుడు గోగికార్ రాంలక్ష్మణ్ మాట్లాడుతూ లాశ్రిత జన్మదినం సందర్భంగా నిలయంకు వితరణ అందచేసిన నవీన్ దంపతులకు కృతజ్ఞతలు తెలియచేసారు. కార్యక్రమంలో నిలయ కమిటీ సభ్యురాలు పోలిన రమాదేవి, వనవాసీ ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

## ప్రజల పట్ల మరింత బాధ్యతతో పని చేస్తాం

- ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తీర్చి దిద్దుతాం
- సిపిఎం సర్పంచుల అభినందన సభలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య
- ఐలు రాష్ట్ర నాయకులు శివరాంప్రసాద్



**పాల్వంచ, విశాలభారతి:** ప్రజలు తమపై నమ్మకం ఉంచి సర్పంచులుగా గెలిపించడంతో మరింత బాధ్యతతో పనిచేస్తామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ఐలు రాష్ట్ర నాయకులు జె శివరాం ప్రసాదులు అన్నారు. పాల్వంచ మండలం బండ్రిగొండ దంతేల బోర గ్రామపంచాయతీలలో గెలిచిన సిపిఎం అభ్యర్థుల అభినందన సభలో వారు మాట్లాడుతూ గతంలో ఉన్న పాలకవర్గం యొక్క అవినీతిపై గ్రామస్థాయిలో ప్రజలను కదిలించారు పోరాటం చేయడం వలన ఈ ప్రాంతంలో సిపిఎం నాయకత్వంపై అనేక నిర్బంధాలు ప్రయోగించాలని వారు తెలియజేశారు. నిర్బంధాలు ఆటంకాలను సైతం ఎదుర్కొని నేడు ప్రజా మద్దతుతో సర్పంచులుగా గెలిచామని వారు కొనియాడారు. డబ్బు మద్యం వేరులే పారుతూ కుల సమీకరణ జరుగుతున్న నేపథ్యంలో నిజాయితీగా సిపిఎం అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు సిపిఎం అభ్యర్థులను గెలిపించడం పట్ల ప్రజల పట్ల మరింత బాధ్యత పెరిగిందని ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని అలంకారప్రాయం కోసం కాకుండా గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగిస్తామని అన్నారు. అవినీతి లేని స్వచ్ఛమైన సుపరిపాలనను అందించి ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దామని అన్నారు. బంటిగుండ గ్రామపంచాయతీలో ప్రజలు అత్యంత చైతన్యంతో 8 వార్డులు సర్పంచ్ స్థానాన్ని సిపిఎం కి అందించడం హర్షించదగిన విషయమని ఇది గత పంచాయతీ పాలకవర్గం పట్ల అసంతృప్తికి నిదర్శనమని అన్నారు. పంచాయతీలలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా సిపిఎం నిర్వహించిన పోరాటాల ఫలితంగానే ప్రజలు నేడు పంచాయతీలో సిపిఎంకు అధికారం ఇచ్చారని అన్నారు. భవిష్యత్తులో ప్రజల సహకారంతో బండ్రిగొండ దంతేలబోర గ్రామపంచాయతీలను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి వార్డు మెంబర్లు సర్పంచులు కృషి చేస్తారని తెలియజేశారు.పారదర్శకమైన పరిపాలన అందించడం సిపిఎం సర్పంచ్లకు మాత్రమే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. బండ్రిగొండ సర్పంచ్ మడివి సురేష్, దంతెలబోర సర్పంచ్ కొండ్రు ప్రసాద్ మరియు వార్డు సభ్యులను అభినదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన వెంకటేశ్వర్లు తులసీరాం పాకాల వెంకట్రావు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మందా నాగకృష్ణ నాయకులు నాగభూషణం, రామదాసు శ్రీను కుర్రాజు తట్టుకోళ్ళ మల్లు కాక శేఖర్ వరలక్ష్మీ రాస లక్ష్మి వంజం సురేష్,దేశబోయిన పుల్లారావు తదితరులు పాల్గొన్నారు

## మోడీ ప్రభుత్వం గద్దె దిగాలి

- రాష్ట్ర మార్క్ మాజీ డైరెక్టర్ కొత్వాల
- మంత్రి పొంగులేటి ఆదేశాలతో పాల్వంచలో కాంగ్రెస్ ఆందోళన కార్యక్రమం

**పాల్వంచ, విశాలభారతి:** భారతదేశానికి అహింసా సిద్ధాంతంతో స్వాతంత్రం సముపార్జించి పెట్టిన మహాత్ముడు జాతిపిత మహాత్మా గాంధీ పేర గ్రామీణ పేదల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరులో మహాత్మా గాంధీ పేరును తొలగించడం దుర్మార్గపు చర్య అని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ టీపీసీసీ,Dcc అధ్యక్షులు తోట దేవి ప్రసన్న రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గార్ల ఆదేశాలతో పాల్వంచలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పాల్వంచ మార్కెట్ లోని మహాత్మా గాంధీ విగ్రహానికి కొత్వాలతో పాటు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు గాంధీజీ చిత్రపటాలు చేత పూని విగ్రహం వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజల బతుకుతెరువు కోసం గత 20 సంవత్సరాలుగా క్రితం సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో 100 రోజుల ఉపాధి హామీ అందేలా చర్యలు చేపట్టిందన్నారు.కేంద్రంలో మోడీ,అమిత్ షా ల నేతృత్వంలోనే బిజెపి ప్రభుత్వం అధికార మదంతో గాంధీ పేరును తొలగించి యావత్ భారత ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించకుండా ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని కొత్వాల హెచ్చరించారు. కార్యక్రమాని కి మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్ అధ్యక్షత వహించగా,ఎల్ డి ఎం కోఆర్డినేటర్ బద్ది కిషోర్,పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్,కిన్నెరసాని సర్పంచ్ వజ్జా రామకృష్ణ,కాంగ్రెస్ నాయకులు ఎస్ వి ఆర్ కె ఆచార్యులు,హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం



- జిల్లా వ్యాప్తంగా 7233 కేసులు పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్
- జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో 11 బెంచీలు ఏర్పాటు
- జాతీయ లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన

**కొత్తగూడెం లీగల్, విశాలభారతి:**

ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 7233 కేసులు పరిష్కారం అయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. ఈ సందర్భంగ కక్షిదారులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టులో 11 బెంచీలను ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు. ఈ సారి జాతీయ లోక్ అదాలత్ కు అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. రాజీమార్గంలో కేసుల పరిష్కారంకోసం కక్షిదారులు పెద్ద ఎత్తున ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇందుకు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసు యంత్రాంగం చేసిన కృషిని కొనియాడారు. వివాదాన్ని సామరస్యంతో పరిష్కరించుకున్న కక్షిదారులకు ఆవార్డు అందజేసి అభినందించారు. రాజీమార్గమే రాజమార్గం అని.. చిన్న తగాదాలను లోక్ అదాలత్ లో పరిష్కరించుకుని స్నేహ పూర్వక వాతావరణం లో ఉండాలని కక్షిదారులకు సూచించారు.రాజీ మార్గమే రాజమార్గమని కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశం కల్పిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతూ లోక్ అదాలత్ కేసు పరిష్కారమై అవార్డు పాస్ చేస్తే అది అంతిమ తీర్పు అవుతుందన్నారు. కక్షిదారులకు పులిహోర మంచినీటి సదుపాయమును ఎస్బిఐ వారి సౌజన్యంతో కల్పించారు.

**జిల్లా వ్యాప్తంగా పరిష్కారమైన కేసుల వివరాలు:**

1.కొత్తగూడెం సివిల్ కేసులు 28.
16 మోటార్ వాహన ప్రమాద కేసులల లో 53లక్షల 40 వేల రూపాయలకు పరిష్కారం అయింది.
**క్రిమినల్ కేసులు -3661**
**పిఎల్ సి కేసులు :** బ్యాంకు మరియు సైబర్ క్రైమ్ కేసులు: 230
**మొత్తం పరిష్కారమైన కేసులు :** 39902. ఇల్లందు
సివిల్ కేసులు 10
క్రిమినల్ కేసులు 493
బ్యాంకు మరియు తెలిఫోన్ కేసులు 111
మొత్తం పరిష్కారమైన కేసులు :614
**3. భద్రాచలం**
క్రిమినల్ కేసులు 1298
బ్యాంకు పి ఎల్ సి కేసులు 102
మొత్తం పరిష్కారమైన కేసులు :1400
**4. మణుగూరు**
క్రిమినల్ కేసులు 1178
పి ఎల్ సి కేసులు : 51
మొత్తం పరిష్కారమైన కేసులు :1229

ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ కె. కిరణ్ కుమార్ మెజిస్ట్రేట్ లు సుచరిత,రవికుమార్,వినయ్ కుమార్, మెందు రాజమల్లు, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి,బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె. గోపికృష్ణ, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు ఆర్. రామారావు, ఎస్బిఐ బ్యాంక్ అధికారులు, పోలీసు అధికారులు కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసే బీజేపీ కుట్ర



- గాంధీ పేరును తొలగించే కుట్రలకు గట్టి నిరసన
- మణుగూరులో కాంగ్రెస్ పార్టీ భారీ నిరసన కార్యక్రమం

**మణుగూరు, విశాలభారతి :**

మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరులో మహాత్మాగాంధీ గారి పేరును తొలగించే కుట్రలకు కాంగ్రెస్ ధీటైన ప్రతిఘటన, జాతీయ ఉపాధి హామీ చట్టం పథకంలో దేశ పిత మహాత్మా గాంధీ పేరును తొలగించి, 'వికసిత్ భారత్ జి.రామ్.జి' అనే కొత్త పేరుతో పథకాన్ని ప్రవేశపెట్టేలా బీజేపీ చేస్తున్న ప్రజావ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ కుట్ర పూరిత విధానాలకు నిరసనగా ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు ఆదివారం నాడు మణుగూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ జాతీయ రహదారిపై కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహాత్మా గాంధీ పేరును పేదల ఉపాధికి భరోసా ఇచ్చే పథకం నుంచి తొలగించడం కేవలం ఒక పేరు మార్పు కాదు,అది దేశ చరిత్రను, విలువలను, ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేసే బీజేపీ కుట్రకు నిదర్శనమని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల పక్షానే నిలబడిందని, జాతీయ ఉపాధి హామీ పథకం అనేది కోట్లాది గ్రామీణ కుటుంబాలకు జీవనాధారమని గుర్తు చేస్తూ, ఈ పథకాన్ని తీసుకొచ్చినది కాంగ్రెస్ పార్టీనే అని, దాని ఆత్మను, గాంధీ గారి పేరును కాపాడటమే కాంగ్రెస్ శ్రేణుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మోడీ డౌన్ డౌన్ గాంధీ పేరు తొలగింపుకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుంది అనే నినాదాలతో జాతీయ రహదారి మార్మోగింది. కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రజావ్యతిరేక విధానాలకు తగిన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీ ఆలోచనలు అమరమైనవి పేదల హక్కులపై కుట్రలకు కాంగ్రెస్ అడ్డుకట్ట రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కోసం కాంగ్రెస్ పోరాటం గాంధీ పేరును చెరిపివేయాలని చూసే వారికి కాంగ్రెస్ పార్టీ పోరాటంతోనే సమాధానం చెబుతుంది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ , టౌన్ అధ్యక్షులు శివ సైదులు , మండల మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య , మండల మైనార్టీ అధ్యక్షులు రహీం పాషా, మాజీ సర్పంచ్ కాటబోయిన నాగేశ్వరావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి , యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ ఐతనబోయిన సతీష్, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## క్రీడాకారుల విజయాలు జిల్లాకు గర్వకారణం

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**కొత్తగూడెం, విశాలభారతి:** క్రీడాకారులు సాధించిన పథకాలు విజయాలు జిల్లాకు గర్వకారణంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. పాల్వంచ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఇటీవల కాకతీయ యూనివర్సిటీ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించిన జిల్లా క్రీడాకారులను ఘనంగా అభినందించారు. పాల్వంచ మినీ స్టేడియంలో నిరంతరం సాధన చేస్తూ చాంపియన్‌షిప్ స్థాయి విజయాలు సాధించడం అభినందనీయమని ఆయన అన్నారు. ఈచాంపియన్‌షిప్‌లో ట్రైబల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కాలేజ్ విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని విజయాలు సాధించడం ప్రత్యేకంగా హర్షణీయమని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కాలేజ్ ప్రిన్సిపాల్ అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ శ్వేతతో పాటు విజయం సాధించిన విద్యార్థినులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే అథ్లెటిక్స్‌లో క్రీడాకారులను శిక్షణనిచ్చి తీర్చిదిద్దుతున్న అథ్లెటిక్స్ కోచ్ నాగేంద్ర, సెక్రటరీ మహిధర్‌లకు కూడా జిల్లా కలెక్టర్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. గిరిజన విద్యార్థినుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీస్తూ వారికి సరైన మార్గనిర్దేశం అందిస్తున్న అధ్యాపకులు, అధికారుల కృషి ప్రశంసనీయమని ఆయన అన్నారు. వారి నిరంతర కృషి ఫలితంగానే జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, విశ్వవిద్యాలయ స్థాయిలో క్రీడాకారులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామరెడ్డి, విద్యార్థులు, క్రీడాకారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనుల్లో మిషన్ భగీరథ పైపులు ధ్వంసం

**మూడు రోజులుగా నిలిచిన మంచినీటి సరఫరా ప్రజల అవస్థలు**



**మణుగూరు, విశాలభారతి :** సమితి సింగారం రోడ్డు విస్తరణ పనులలో భాగంగా భారీ చెట్లను తొలగిస్తున్న సమయంలో మిషన్ భగీరథకు సంబంధించిన నీటి పైపులు పగిలిపోయాయి. ఈ ఘటన కారణంగా గత మూడు రోజులుగా ఈ ప్రాంత ప్రజలకు మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఆదివారం కావడంతో ఎక్కువ మంది ప్రజలు ఇళ్ల వద్దనే ఉండటంతో తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు కనీస అవసరాలకు కూడా నీళ్లు లేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పగిలిన పైపులను తక్షణమే మరమ్మతులు చేసి మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్లక్ష్యం కొనసాగితే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## కరాటే పోటీలలో స్టెల్లా మేరీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

- చదువుతోపాటు కరాటే విద్య కూడా అందిస్తున్నాం
- స్టెల్లా మేరీ స్కూల్ ప్రిన్సిపల్ సుమలత
- కరాటే ఆడపిల్లల ఆత్మ రక్షణకు ఆయుధం
- శత్రువును అధిగమించాలంటే కరాటే తప్పనిసరి



**బూర్గంపాడు,విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర స్టెల్లా మేరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరాటే,కుంగ్ ఫు పోటీలలో అత్యధిక ప్రతిభ కనపరిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సిస్టర్ సుమలత మాట్లాడుతూ కరాటే అంటే కాళీ చేతులు అని అర్థం. కరాటే శారీర దారుఢ్యం పెంచుకోవడానికి, శత్రువుల నుండి కాపాడుకోవడానికి, కాళీ చేతులను ఆయుధాలుగా మార్చుకోవడమే కరాటే ముఖ్య ఉద్దేశమని అన్నారు. గణేష్ సాయి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన తెలంగాణ స్టేట్ లెవెల్ కరాటే పోటీలలో స్టెల్లా మేరీస్కూల్ విద్యార్థులు 13 మంది పోటీలో పాల్గొనగా గోల్డ్ మెడల్స్ 5. బాలికలు 2, బాలురు 3, సిల్వర్ మెడల్స్ 5 బాలికలు 2. బాలురు 3, బ్రౌన్స్ 5. బాలికలు 1, బాలురు 4.అత్యధిక ప్రతిభ కనబరిచి స్టేట్ లెవెల్ పోటీలలో స్టెల్లా మేరీ స్కూల్ సత్తా చాటినందుకు విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. చదువుతోపాటు కరాటే విద్యను కూడా స్టెల్లా మేరీ స్కూల్లో మాస్టర్ కిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఇటీవలే జరుగుతున్న శత్రువుల దాడులను విద్యార్థులు ఎదుర్కోవాలంటే బాల్యం నుంచె కరాటే శిక్షణ తరగతులు విద్యార్థులకు తప్పనిసరి అని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న విద్య కరాటే అని ప్రతి ఒక్కరికి ఇది చాలా అవసరమని కొనియాడారు.

## సినిమా యంగ్ హీరోదా..
# సీనియర్ హీరోదా..?

టాలీవుడ్ యాక్టర్ రవితేజ కిశోర్ తిరుమల దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఈ మూవీలో ఆషికా రంగనాథ్, ఖిలాడి ఫేం డింపుల్ హయతి ఫీమేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. 2026 సంక్రాంతి కానుకగా జనవరి 13న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా ఆషికా రంగనాథ్ చేసిన చిట్‌చాట్‌లో ఏజ్ గ్యాప్ టాపిక్ వచ్చింది. నాగార్జున, చిరంజీవి, కల్యాణ్ రామ్, రవితేజ లాంటి స్టార్ యాక్టర్లతో కలిసి నటిస్తూ కెరీర్‌లో బిజీగా మారిపోయింది కన్నడ భామ ఆషికా రంగనాథ్ . అయితే ఆషికా రంగనాథ్ నటిస్తోన్న కో యాక్టర్లంతా సీనియర్ హీరోలని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. కొందరు హీరోయిన్లు సీనియర్ హీరోలతో నటించేటప్పుడు ఏజ్ గ్యాప్ విషయంలో అంతగా పట్టించుకోకుండా ప్రొఫెషనల్‌గా మాత్రమే ఆలోచిస్తారు. ఈ కోవలోకే వస్తుంది ఆషికా రంగనాథ్. ఏజ్‌గ్యాప్‌పై ఆషికా రంగనాథ్ మాట్లాడుతూ.. ఎన్ని విభిన్న పాత్రల్లో నటించాలనే దానిపై ఫోకస్ పెడతా. భర్త మహాశయులకు విజ్ఞప్తిలో నా పాత్ర చాలా యంగ్‌గా, మోడ్రన్‌గా ఉంటుంది. నా సామి రంగాలో నాగార్జునతో కలిసి చాలా పరిణతి ఉన్న పాత్రలో నటించా. నేను భిన్నత్వం కోసం చూస్తా. నటుడి వయస్సుకు సంబంధించిన విషయంపై అంతగా పట్టించుకోను. నాకిచ్చిన పాత్రలో ఎలా సరిపోతా. ఆ పాత్రను సమర్థవంతంగా ఎలా పోషించి ఒప్పిస్తాననేదానిపైనే ఫోకస్ అంతా ఉంటుంది. అది యువ హీరో సినిమానా..? సీనియర్ హీరో సినిమానా..? అనేది విషయమే కాదు. కథకు నా పాత్ర ఎంతవరకు బలం ఇస్తుందనే మ్యాటర్ ఇక్కడ.. అంటూ చెప్పుకొచ్చింది ఆషికా రంగనాథ్. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.